ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పెద్దపల్లి
జిల్లా వార్తలు
3★
శనివారం 21 డిసెంబరు 2024



వేగవంతంగా ఇందిరమ్మ ఇళ్ల సర్వే..

- డీపీవో వీర బుచ్చయ్య

6



కొలనూర్‌లో వివరాలు తెలుసుకుంటున్న డీపీవో వీరబుచ్చయ్య

ఆసుపత్రి నిర్మాణం త్వరగా పూర్తి చేయాలి

- కలెక్టర్ కోయ శ్రీ హర్ష

6



ఆసుపత్రి నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీహర్ష

న్యూస్ బాక్స్

రాష్ట్రస్థాయి సెమినార్‌కు గణిత ఉపాధ్యాయురాలు ఎంపిక



పెద్దపల్లి కల్చరల్, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయిలో జరిగే గణిత సెమినార్‌కు జిల్లాకు చెందిన గణిత ఉపాధ్యాయురాలు కే.అనిత ఎంపికయ్యారు. అనితను ప్రత్యేకంగా అభినందిస్తున్నట్లు డీఈవో మాధవి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రాచీన వేద గణితం నుంచి నేటి క్వాంటం కంప్యూటర్ ముఖ్యాంశంతో కే.అనిత సెమినార్ పత్రం ఎంపికైందని, వరుసగా రెండవసారి ఆమె ఎంపిక కావడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈనెల 21న హైదరాబాద్‌లోని రాష్ట్ర విద్యా పరిశోధన సంస్థలోని గోదావరి భవన్‌లో ఆమె ప్రదర్శన ఇవ్వనున్నారు. రామగుండం మండలం దుర్గయ్యపల్లి యూపీఎస్‌లో అనిత డిప్యూటేషన్‌పై విధులు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు.

రామగుండం కార్పొరేషన్‌కు 30మంది కొత్త సిబ్బంది

కోల్‌సిటీ, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): రామగుండం నగరపాలక సంస్థకు 30మంది ఉద్యోగులను కొత్తగా కేటాయించారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా ఎంపికైన పలువురు ఉద్యోగులకు రామగుండంలో పోస్టింగ్ ఇచ్చారు. ఇందులో ముగ్గురు జూనియర్ అకౌంటెంట్లు, ఐదుగురు జూనియర్‌అసిస్టెంట్లు, 22మంది వార్డు ఆఫీసర్లు ఉన్నారు. వారు రెండురోజులుగా విధుల్లో చేరుతున్నారు. దీంతో కార్పొరేషన్‌కు సిబ్బంది కొరత తీరే అవకాశం ఉంది. ఇప్పటికే వీఆర్‌వోలను రామగుండంలో వార్డు ఆఫీసర్లుగా నియమించారు. దీంతో పాటు కొత్తగా మరో 30మంది చేరారు.

రెండో ఏఎన్‌ఎంలను రెగ్యులర్ చేయాలి

పెద్దపల్లిటౌన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : రెండవ ఏఎన్‌ఎంలను ప్రభుత్వం గుర్తించి రెగ్యులరైజ్ చేయాలని జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు చెందిన రెండో ఏఎన్‌ఎంలు, ఈసీ ఏఎన్‌ఎంలు శుక్రవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 29న జరగనున్న రాత పరీక్షను రద్దు చేసి తమను రెగ్యులర్ చేసి తర్వాత మిగతా పోస్టులకు రాతపరీక్ష నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఏఎన్‌ఎంలు శ్రీమతి, స్కైలాబ్ రాణి, సరోజ, శారద, అరుంధతి, రమాదేవి, రాజేశ్వరి, సరస్వతి, నిర్మల, భూలక్ష్మి, దీప తదితరులు పాల్గొన్నారు.

ఫలించనున్న నిరీక్షణ

- ధరణి స్థానంలో తెలంగాణ భూభారతి
- సాదాబైనామాలను క్రమబద్ధీకరిస్తామని ప్రకటన
- జిల్లావ్యాప్తంగా పెండింగులో 35,580 దరఖాస్తులు



(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

సాదా బైనామాల ద్వారా కొనుగోలు చేసిన భూముల క్రమబద్ధీకరణ కోసం నాలుగేళ్లుగా నిరీక్షిస్తున్న రైతుల కల ఫలించనున్నది. గత ప్రభుత్వ హయాంలో ఆర్‌వోఆర్ చట్టం-2020 ద్వారా తీసుకవచ్చిన ధరణి పోర్టల్‌ను ప్రక్షాళన చేసి రూపొందించిన నూతన ఆర్‌వోఆర్ చట్టం తెలంగాణ భూభారతి ద్వారా సాదాబైనామాలను పరిష్కరిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. దీంతో రైతుల్లో ఆశలు రేకెత్తాయి. సాదా బైనామాల ద్వారా భూములను కొనుగోలు చేసి వాటి క్రమబద్ధీకరణ కోసం నాలుగేళ్ల క్రితం చేసుకున్న దరఖాస్తులు పరిష్కారం కాకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో స్వీకరించిన దరఖాస్తులను మూడేళ్ల పాటు పట్టించుకోలేదు. దీంతో ప్రభుత్వం నుంచి అందాల్సిన ప్రయోజనాలను రైతులు కోల్పోవాల్సి వచ్చింది. తమ అవసరాల కోసం భూములను విక్రయించుకోవాలనుకున్న వారికి ఆ అవకాశం లేకుండా పోయింది. గత ప్రభుత్వం అమలుచేసిన రైతుబంధు, కేంద్రం అమలుచేస్తున్న ప్రధాని కిసాన్ సమ్మాన్ నిధి, ఇతరత్రా సబ్సిడీ పథకాలకు రైతులు నోచుకోవడం లేదు. 2014 జూన్ 2వ తేదీలోపు సాదాబైనామాల ద్వారా భూములను కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్లు చేసుకోలేని వారి భూములను ఆర్‌వోఆర్ చట్టం ద్వారా ఆ భూములను క్రమబద్ధీకరించి పట్టాదారు పాసుపుస్తకాలను జారీ చేసేందుకు ప్రభుత్వం 2020 అక్టోబరు 1 నుంచి 31వ తేదీ వరకు దరఖాస్తులను ఆహ్వానించింది. ఆ తర్వాత నవంబరు 10వ తేదీ వరకు పొడిగించారు. మ్యానువల్‌గా కాకుండా మీసేవా కేంద్రాల ద్వారా దరఖాస్తులను స్వీకరించారు. జిల్లా వ్యాప్తంగా 35,580 దరఖాస్తులు వచ్చాయి. అప్పటి ప్రభుత్వం రూపొందించిన ఆర్‌వోఆర్ చట్టం-2020 ద్వారా అక్టోబరు 24వ తేదీన ధరణి పోర్టల్‌ను తీసుకవచ్చింది. నవంబరు 2వ తేదీ నుంచి ఈ పోర్టల్ అమల్లోకివచ్చింది. సాదా బైనామా దరఖాస్తులను పరిశీలించి రైతులకు ఆ భూములకు హక్కులను కల్పిస్తూ పట్టాదారు పాసుపుస్తకాలను జారీ చేయాల్సిన గత ప్రభుత్వం కోర్టులో కేసు కారణంగా పెండింగులో పెట్టింది. కోర్టులో దాఖలైన పిటిషన్‌కు కౌంటర్

మిగతా 6వ పేజీలో...

మండలాల వారీగా వచ్చిన దరఖాస్తులు..

అంతర్గాం	903
పాలకుర్తి	1,642
ధర్మారం	2,294
ఎలిగేడు	1,215
కమాన్‌పూర్	532
రామగుండం	412
రామగిరి	1,243
జూలపల్లి	1,220
ముత్తారం	2,834
కాల్వశ్రీరాంపూర్	5,670
ఓదెల	3,557
పెద్దపల్లి	5,939
మంథని	4,563
సుల్తానాబాద్	3,556

పఠనం,గణితం సామర్థ్యాలను పెంచాలి : కలెక్టర్



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి కల్చరల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న ప్రతి విద్యార్థికి కనీస విద్యా ప్రమాణాలు కల్పించాలని, వారిలో పఠనం, గణితం సామర్థ్యాలను పెంచేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. శుక్రవారం కలెక్టర్ కోయ శ్రీహర్ష జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఓదెల, శ్రీరాంపూర్ మండలాల ఉపాధ్యాయులతో కలెక్టరేట్‌లో నిర్వహించిన కాఫీ విత్ టీచర్స్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ విద్యార్థులలో పఠనం, గణిత సామర్థ్యాలు పెంచాలని తెలిపారు. పాఠశాలలో బోధన విధానంలో ఉన్న లోపాలను సవరించుకొని పాఠశాలలోని 80శాతం పిల్లలలో పఠన, గణిత సామర్థ్యాలు పెంచితే జిల్లాస్థాయిలో పాఠశాల ఉపాధ్యాయులకు ప్రోత్సాహక సర్టిఫికెట్ ఇస్తామన్నారు. విద్యార్థులలో సామర్థ్యాలను పెంచుటకై మధ్యాహ్నం షెడ్యూల్‌లో ఏడు, ఎనిమిది పీరియడ్స్‌ను రిమీడియట్ బోధనను నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి డి. మాధవి, జిల్లా సమగ్ర శిక్ష సమన్వయకర్త పీఎం షేక్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జనవరి చివరి నాటికి ఆయిల్‌పామ్ ప్లాంటేషన్ పూర్తి..

పెద్దపల్లిటౌన్, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ప్రస్తుత సంవత్సరానికి సంబంధించిన 850ఎకరాల ఆయిల్‌పామ్ మొక్కల ప్లాంటేషన్ జనవరి చివరి నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఆయిల్‌పామ్ మొక్కల గ్రౌండింగ్‌పై సంబంధిత అధికారులతో కలెక్టర్ రివ్యూ నిర్వహించారు. ప్రస్తుత సంవత్సరంలో జిల్లాలో 436 ఎకరాలలో ఆయిల్‌పామ్ ప్లాంటేషన్ జరిగిందని, ఈ సంఖ్యను జనవరి చివరి నాటికి 850 ఎకరాలకు తీసుకుపోవాలని ఆదేశించారు. ఆ దిశగా వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ఈ సమావేశంలో డీహెచ్‌ఎస్‌వో జగన్మోహన్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి ఆదిరెడ్డి, తిరుమల ఆయిల్‌పామ్ కంపెనీ సీఈవో కేశు కళ్యాణ్‌కర్ పాల్గొన్నారు.

నేరస్థులకు శిక్షలు పడే విధంగా కృషి..

- నేర సమీక్ష సమావేశంలో సీపీ శ్రీనివాస్



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న సీపీ శ్రీనివాస్

కోల్‌సిటీ, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో వివిధ కేసుల్లో నిందితులుగా ఉన్నవారి నేరాలను రుజువు చేయించి ఎక్కువ కేసుల్లో శిక్షలు పడేలా కృషిచేయాలని సీపీ శ్రీనివాస్ పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల పోలీస్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం రాత్రి రెండు జిల్లాల పోలీస్ అధికారులు, ఎస్‌హెచ్‌ఓలతో ఆన్‌లైన్ జూమ్ మీటింగ్ ద్వారా వార్షిక నేర సమీక్ష నిర్వహించారు. ప్రతి కేసును డీసీపీ, ఏసీపీ, సీఐల స్థాయిలో సమీక్షించాలని, విచారణలో ఉన్న కేసులను త్వరగా విచారించాలన్నారు. పోక్సో, ఎస్‌సీ, ఎస్‌టీ కేసుల్లో విచారణను త్వరగా పూర్తిచేసి చార్జిషీట్ దాఖలుచేయాలన్నారు. ఎస్, ఎస్‌టీ, మహిళలకు సంబంధించిన కేసులను త్వరగా పరిష్కరించాలని, నేరాల నియంత్రణ విజిబుల్ పోలీసింగ్ నిర్వహించాలని, నిరంతరం పెట్రోలింగ్‌తో పాటు వాహనాల తనిఖీలు నిర్వహించాలన్నారు. క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బంది ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఉండాలని, నేరాలు జరుగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. కొత్త సంవత్సరంలో అధికారుల పనితీరును బట్టి గ్రేడింగ్ ఇస్తామన్నారు. ఆయా ఠాణాల పరిధిలో రౌడీలు, అసాంఘిక శక్తులు, మావోయిస్టులపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. డయల్ 100కు కాల్ రాగానే సంఘటన స్థలానికి చేరుకుని సమస్య పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ, మరణాల సంఖ్య తగ్గించేందుకు ప్రభుత్వ విభాగాలతో కలిసి పని చేయాలన్నారు. ఎవరైనా తప్పిపోయిన ఫిర్యాదు అందిన వెంటనే అన్ని పోలీస్‌స్టేషన్లకు పంపి వెబ్‌సైట్‌లో పెట్టాలన్నారు. అసహజ మరణాల దర్యాప్తులో సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించుకోవాలని, లోతుగా పరిశోధన చేయాలన్నారు. గంజాయి, పేకాట, పీడీఎస్ బియ్యం రవాణా, నాటుసారా, ఇతర వైట్ కాలర్ నేరాలపై చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో పెద్దపల్లి డీసీపీ చేతన, అడిషనల్ డీసీపీ(అడ్మిన్) సీ రాజు, ఎస్‌సీ ఏసీపీ రాఘవేంద్రరావు, కమిషనరేట్ పరిధిలోని ఏసీపీలు, ఏఆర్ ఏసీపీలు ప్రతాప్, సుందర్, ఇంటలీజెన్స్ ఏఓ తసాస్ మాలిక్, ఏఓ శ్రీనివాస్, వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

డయల్ యువర్ డీఎంలో ఫిర్యాదుల వెల్లువ

కళ్యాణ్‌నగర్, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని, పెద్దపల్లి పట్టణాల పరిధిలో బస్సుల సంఖ్య పెంచాలని ప్రయాణికులు గోదావరిఖని ఆర్‌టీసీ డిపో మేనేజర్ నాగభూషణంను కోరారు. శుక్రవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమంలో డిపో మేనేజర్ పాల్గొన్నారు. భూపాలపల్లి రూట్‌లో మరిన్ని సర్వీసులు పెంచాలని పలువురు కోరారు. గోదావరిఖని నుంచి మణుగూరుకు వెళ్లే సర్వీసును వయా లైటింక్లయిన్‌కాలనీ మీదుగా నడపాలని విజ్ఞప్తిచేశారు. పెద్దపల్లి నుంచి జమ్మికుంటకు ఉదయం బస్సు నడపాలని, గోదావరిఖని నుంచి వచ్చే సర్వీసు ప్రయాణికులతో నిండుగా వస్తుందని, అందులో ప్రయాణించలేకపోతున్నామని, జమ్మికుంటకు సర్వీసులను ఉదయం వేళలో పెంచాలని కోరారు. ఓదెల బస్సును మడక వరకు నడిపి ప్రయాణికులకు సౌకర్యంగా ఉండే విధంగా ఉండాలని సూచించారు. ప్రయాణికులు చాలా మంది సమస్యలను, సలహాలను ఇచ్చారని డీఎం నాగభూషణం చెప్పారు.

● మంథని (ఆంధ్రజ్యోతి): మంథని ఆర్టీసి డిపో మేనేజర్ శ్రావణ్‌కుమార్ శుక్రవారం నిర్వహించిన డయల్ యువర్ డీఎం కార్యక్రమానికి స్పందన లభించింది. దాదాపు 15మంది కాల్స్ చేసి సూచనలు, సలహాలు ఇచ్చినట్లు డీఎం తెలిపారు. మంథని-జమ్మికుంటకు నైట్‌అవుట్ సర్వీస్, మంథని-పలిమెల, కాళేశ్వరం-వేములవాడ, పెద్దపల్లి నుంచి భాగ్యనగర్ ట్రైన్‌కు లింకుద్వారా మంథనికి బస్సులు నడపాలని సూచించారు. ఉన్నతాధికారులతో చర్చించి కొత్త బస్సులు రాగానే పరిస్థితులను బట్టి ఆయా సర్వీసుల విషయంలో నిర్ణయం తీసుకుంటామని ఆయన తెలిపారు.

ఐకేపీ సెంటర్ తూకంలో తేడాలపై విచారణ



ఐకేపీ సెంటర్‌లో విచారణ చేపడుతున్న అధికారులు

రామగిరి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగేపల్లి గ్రామంలోని ఐకేపీ సెంటర్‌లో ధాన్యం తూకంలో తేడాలపై కలెక్టర్ శ్రీహర్ష ఆదేశాల మేరకు శుక్రవారం తూనికలు, కొలతల అధికారి విశ్వేశ్వర్, జిల్లా సహకార సొసైటీ అధికారి శ్రీమాల, డీఆర్‌డీవో రవీందర్, అంబుడ్స్‌పర్సన్ తిమ్మరాజు శరత్‌కుమార్‌లు విచారణ చేపట్టారు. కేంద్రంలోని ఎలక్ట్రికల్ కాంటాలను పరీక్షించారు. తూకంలో కిలోకు 700 గ్రాముల తేడాలను గుర్తించి కాంటాలను సీజ్ చేశారు. సెంటర్ నిర్వాహకుడికి నోటీసు జారీ చేశారు. ఐకేపీ సెంటర్ నుంచి మిల్లర్స్‌కు తరలించిన 30 లారీలకు ధాన్యం వే బ్రిడ్జి తూకం సంబంధించిన ఆధారాలను సేకరించారు. సెంటర్ నుంచి రైతుల వద్ద సేకరించిన 7వేల799 క్వింటాళ్ల ధాన్యం మిల్లర్స్‌కు చేరుకోగా, అందులో 23 క్వింటాళ్ల 89 కిలోల ధాన్యం ఎక్కువగా వెళ్లినట్లు నిర్ధారణకు వచ్చారు. అందులో వివిధ కారణాలతో 15 కింటాళ్ల 61 కిలోలు షార్టేజ్ కింద తొలగించగా, 8 క్వింటాళ్ల 29 కిలోల తేడాలను గుర్తించారు. సెంటర్‌లో జరిగిన తూకం తేడాలపై విచారణ నివేదికను కలెక్టర్‌కు సమర్పిస్తామని తూనికల కొలతల అధికారి విశ్వేశ్వర్ తెలిపారు.

ఆటో యూనియన్ నాయకుల ముందస్తు అరెస్టు

కోల్‌సిటీ, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): చలో అసెంబ్లీ కార్యక్రమానికి వెళతారనే అనుమానంతో గోదావరిఖనికి చెందిన పలువురు ఆటో యూనియన్ నాయకులను శుక్రవారం వన్‌టౌన్‌పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆటో యూనియన్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు మంద రవికుమార్, నీలారపు రవి, బత్తుల వెంకట్‌లను అదుపులోకి తీసుకున్నారు. కాగా, ఏఐఎస్‌ఎఫ్ అసెంబ్లీ ముట్టడి పిలుపు నేపథ్యంలో గోదావరిఖని వన్‌టౌన్ పోలీసులు ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి రేణికుంట్ల ప్రీతం, నాయకులు సురేష్, మాతంగి సాగర్, ఆవునూరి అరవింద్‌లను ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. దీనిని ఏఐఎస్‌ఎఫ్ నాయకులు ఖండించారు.

● ఓదెల (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆటో యూనియన్ నాయకులను శుక్రవారం పొత్కపల్లి ఎస్సై అశోక్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆటోడ్రైవర్ యూనియన్ నాయకులను సభ్యులను అదుపులోకి తీసుకున్నారు. రంగు ఆనంద్, తూడి శంకర్, శాతాళ్ళ కుమార్, జెట్టి కుమార్, మేకల శ్రీకాంత్, ప్రశాంత్, తిరుమల్, నాగేష్‌ను అదుపులోకి తీసుకొని, సొంత పూచీకత్తుపై విడుదల చేసినట్లు ఎస్సై తెలిపారు.

● ఎలిగేడు (ఆంధ్రజ్యోతి) : మండలంలో ఉన్న ఆటో డ్రైవర్లను శుక్రవారం జూలపల్లి పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి ఠాణాకు తరలించారు. ఈనెల 20న ఆటోడ్రైవర్ల సమ్మె అసెంబ్లీ ముట్టడి సందర్భంగా ముందస్తు అరెస్టు చేశామని పోలీసులు తెలిపారు. ఎలిగేడు, సుల్తాన్‌పూర్, ధూళికట్టలకు చెందిన ఆటో యూనియన్ అధ్యక్షులు కవ్వంపల్లి శ్రీనివాస్, భూసార శ్రీనివాస్, బింగి రాజు, కొం రయ్యలను అరెస్టు చేశారు.

డీఎస్పీ ఆధ్వర్యంలో రిలేదీక్ష

పెద్దపల్లిటౌన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ, ఎస్టీ బీసీల సమస్యలు పరిష్కరించాలంటూ ధర్మ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ ఎదుట రిలే దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా కన్వీనర్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీలకు విద్య, వైద్యం ఉపాధి, భూమి, ఇళ్లు కల్పించాలని డిమాండ్ చేశారు. గతంలో ఎన్నోసార్లు కలెక్టర్‌కు ఈ విషయమై వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. జనాభాలో 90 శాతం ఉన్న బీసీ ఎస్సీ, ఎస్టీలకు న్యాయం జరగడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా కార్యదర్శులు ఏదుల్ల శంకరయ్య, కండె రవీందర్, క్యాదసి రమేష్, శనిగరం కృష్ణ, అవునూరి సతీష్, ఆషాడం ముఖేష్, కుక్క అవినాష్, మంతెన రమకాంత్, దబ్బేట సందీప్, మహారాజు రాజు, శనిగారం రాము తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్‌పై అక్రమ కేసులు ఎత్తివేయాలి

- రాజకీయ కక్షలతో కేసులు
- మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్



నిరసన దీక్షలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్

గోదావరిఖని, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఫార్ములా ఈ-కార్ రేసింగ్‌తో ప్రపంచవ్యాప్తంగా తెలంగాణ, హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను పెంచింది మాజీ మంత్రి కేటీఆర్ అని, రాజకీయ కక్షలతో కేటీఆర్‌పై అక్రమ కేసులు పెట్టారని మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ఆరోపించారు. శుక్రవారం గోదావరిఖని ప్రధాన చౌరస్తాలోని టీబీజీకేఎస్ కార్యాలయ ఆవరణలో కేటీఆర్‌పై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని, ఎన్నికల సమయంలో కాంగ్రెస్ 420 హామీలు నేరవేర్చాలని డిమాండ్ చేస్తూ కోరుకంటి చందర్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ నాయకులు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా చందర్ మాట్లాడుతూ రేవంత్ సర్కార్ ఏదో ఒక విధంగా గత బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని, మాజీ మంత్రి కేటీఆర్‌ను బదనాం చేయాలన్న లక్ష్యంతో అక్రమ కేసులతో కక్ష సాధింపులకు దిగుతుందన్నారు. ఎన్ని అక్రమ కేసులు పెట్టినా, ఎన్ని అబద్ధపు ప్రచారాలు చేసినా బెదిరేది లేదన్నారు. రాష్ట్రంలో నడుస్తోంది ప్రజాపాలన కాదని పోలీసు పాలన అన్నారు. ప్రశ్నిస్తే కేసులు, నిలదిస్తే అరెస్టులు చేస్తుందన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకిచ్చిన హామీలను నేరవేర్చకుండా ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు కేటీఆర్‌పై అక్రమ కేసులు పెడుతున్నారన్నారు. ఉద్యమాల గడ్డ రామగుండం నుంచి రెవంత్‌రెడ్డి పాలన పతనం ప్రారంభమైందన్నారు. కేటీఆర్‌పై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేసే దాకా రిలే దీక్షలు సాగుతాయని హెచ్చరించారు. రాబోవు కాలంలో ప్రజా కోర్టులో రేవంత్ సర్కారుకి తగిన శాస్తి జరగడం ఖాయమన్నారు. ఈ దీక్షల్లో బీఆర్‌ఎస్ నాయకులు మూల విజయరెడ్డి, గోపు ఐలయ్య యాదవ్, కార్పొరేటర్లు గాదం విజయ, బాదె అంజలి, జనగామ కవిత సరోజిని, నాయకులు నారాయణదాసు మారుతి, అచ్చే వేణు, బొడ్డు రవీందర్, మేతుకు దేవరాజ్, రాకం వేణు, జిట్టవేన ప్రశాంత్, సట్టు శ్రీనివాస్, తోకల రమేష్, నూతి తిరుపతి, సింహచలం రత్నకర్, చెలకలపల్లి శ్రీనివాస్, జక్కుల తిరుపతి, నీరటి శ్రీనివాస్, కృష్ణస్వామి, ఇరుగురాళ్ల శ్రావన్, చింటూ, రామరాజు, ఆవునూరి వెంకటేష్, ముద్దసాని సంధ్యారెడ్డి, కోడి రామకృష్ణ, యాసర్ల తిమోతి, కర్రి ఓదేలు, గడ్డం నారాయణ, నిట్టూరి రాజు, బోయ రాజశేఖర్ పాల్గొన్నారు.



ట్రాఫిక్ కమ్యూనిటీ సర్వీసింగ్ విధులు నిర్వహిస్తున్న ప్రభుదాస్

ట్రాఫిక్ కమ్యూనిటీ సర్వీసింగ్ విధులు...

- డ్రంకెన్ డ్రైవ్ కేసులో జడ్జి తీర్పు..

కోల్‌సిటీ, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): డ్రంకెన్ డ్రైవ్‌లో రెండవ సారి పట్టుబడిన గోసిపాతల ప్రభుదాస్‌కు గురువారం గోదావరిఖని రెండవ అదనపు న్యాయమూర్తి వెంకటేష్ దుర్వ ఒకరోజు ట్రాఫిక్ కమ్యూనిటీ సర్వీసింగ్ విధులు నిర్వహించాలని తీర్పునిచ్చారు. ఈ మేరకు ఎస్‌ఐ జీ హరిశేఖర్ ఆధ్వర్యంలో మున్సిపల్ జంక్షన్ వద్ద ప్రభుదాస్‌తో ట్రాఫిక్ రిలేషన్ విధులు చేయించారు. హెల్మెట్ ధారణ ప్రాణానికి రక్షణ, మద్యం సేవించి వాహనాలు నడుపరాదని ప్లకార్డులు ప్రదర్శిస్తూ విధులు నిర్వహించారు. కానిస్టేబుల్ జంపయ్య, ఇతర సిబ్బంది ఉన్నారు.

ఊషన్నపల్లి పాఠశాలను సందర్శించిన లక్నో బృందం



విద్యార్థులతో మాట్లాడుతున్న లక్నో బృందం సభ్యులు

కాల్వశ్రీరాంపూర్, డిసెంబర్ 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గంగారం మండల పరిషత్ ఇంగ్లీష్ మీడియం ప్రాథమిక పాఠశాలను ఉత్తర్ ప్రదేశ్‌లోని లక్నోకు చెందిన దేవిసంస్థాన్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు శుక్రవారం సందర్శించారు. ఫౌండేషన్ లిటరసీ, న్యూమరసీ కార్యక్రమం అమలుతీరును పరిశీలించారు. యూకేజీ నుంచి 5వ తరగతి వరకు మొత్తం ఆరు తరగతుల పిల్లల్లో భాషాంశాలతో పాటు గణిత ప్రక్రియలను పరీక్షించారు. పిల్లలతో తెలుగు, ఇంగ్లీష్ పాఠ్యపుస్తకాలను చదివించారు. గణితంలో చతుర్విధ ప్రక్రియలోని వివిధ అంశాలను పరీక్షించి విద్యార్థులను, పాఠశాల సిబ్బందిని అభినందించారు. అకాడమిక్ మానిటరింగ్ అధికారి డాక్టర్ పీఎం షైక్, డీఆర్పీ సంది సంపత్‌రెడ్డి మాట్లాడుతూ కలెక్టర్, డీఈవో ఆధ్వర్యంలో ఎఫ్ఎల్ఎన్ ప్రోగ్రాం విజయవంతంగా ముందుకు వెళ్తోందని, ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేసి కార్యక్రమాన్ని వందశాతం పూర్తిచేయాలని కోరారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యయులు ఈర్ల సమ్మయ్య, ఉపాధ్యాయులు అమృతసురేష్‌కుమార్, బండారి స్రవంతిలు మహారాష్ట్ర, లక్నోకు చెందిన దేవి సంస్థాన్ స్వచ్ఛంద సంస్థ సభ్యులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో లక్నో దేవిసంస్థాన్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు సయ్యద్ మహమ్మద్ సలీం, ప్రవీణ్‌యాదవ్, ప్రధానోపాధ్యాయుడు ఈర్ల సమ్మయ్య ఉపాధ్యాయులు అమృతసురేష్‌కుమార్, బండారి స్రవంతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థుల ఇంటిదారి

● వరుస ఘటనలతో తల్లిదండ్రుల్లో ఆందోళన



పెద్దాపూర్ గురుకులంలో తొలగించిన పెద్దచెట్లు

మెట్‌పల్లి రూరల్, డిసెంబర్, 20 (ఆంధ్రజ్యోతి) : పెద్దాపూర్ గురుకుల పాఠశాల విద్యార్థులకు భయం పట్టుకుంది. దీంతో ఒక్కొక్కరుగా ఇంటి దారి పడుతున్నారు. రెండు రోజుల వ్యవధిలో ఇద్దరు విద్యార్థులు ఆస్పత్రి పాలు కావడంతో విద్యార్థుల తల్లిదండ్రుల్లో కలవరం మొదలైంది. గురుకుల పాఠశాలలో 416, కళాశాలలో 130మంది విద్యారులు చదువుతున్నారు. వరుసగా విద్యార్థులు అస్వస్థతకు గురికావడం వాటికి కారణాలు తెలయక పోవడంతో తల్లిదండ్రులు భయంతో తమ తమ పిల్లలను ఇంటికి తీసుకెళ్తున్నారు. కళాశాల విద్యార్థులు మినహా పాఠశాల విద్యార్థులు దాదాపు ఖాళీ అయ్యారు. నాలుగు నెలల క్రితం గురులంలో జరిగిన ఘటనలతో రాష్ట్రవ్యాప్తంగా చర్చకు దారి తీసింది. తాజాగా మళ్లీ ఇద్దరు విద్యార్థులకు పాము కాటు అనే అనుమానాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ క్రమంలో పాఠశాలలో చదివే విద్యార్థులకు ఎలాంటి ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టి భరోసా కల్పించేంత వరకు తమ పిల్లలను పంపించమని కలెక్టర్ సత్యప్రసాద్‌కు తల్లిదండ్రులు తెలిపారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు

గురుకులం ఆవరణతో పాటు పరిసర ప్రాంతాల్లో పాములు, కిటక పురుగులు రాకుటండా తిరుగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, పాఠశాలలో గదుల వేనుక పెరిగిన పిచ్చి మొక్కలు, గడ్డి, పాత గదులను తొలగించి, పాఠశాలలో పారిశుధ్యం పనులు చేసి అన్ని వసతులను కల్పించేందుకు అధికారులు పనులు చేపట్టారు. కలెక్టర్ సత్యప్రసాద్ పర్యవేక్షణలో అధికారులతో గురుకులంలోని చెత్త, పిచ్చి మొక్కలు, ప్రహరీ గోడకు ఉన్న రంధ్రాలు మూసివేయడం, శానిటేషన్ పనులు చేపట్టారు. గురుకులం పెద్దచెట్లు ఉండడంతో కోతులు బెడద నుంచి రక్షణ కోసం వాటిని తొలగిస్తున్నారు. పిల్లలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లను క్షుణంగా పరిశీలించి పనులు చేయిస్తున్నారు.

చికిత్స పొందుతున్న గురుకుల విద్యార్థుల డిశ్చార్జి

గురుకుల పాఠశాలలో అస్వస్థతకు గురై చికిత్స పొందుతున్న ఇద్దరు విద్యార్థులు ఓం కారి అఖిల్, బోడ యశ్వంత్ డిశ్చార్జి అయినట్లు మెడికల్ అధికారి అంజిత్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. అస్వస్థతకు గురైన విద్యార్థులను ఉపాధ్యాయులు కోరుట్లలోని వేరు వేరు ఆసుపత్రులకు తరలించారు. ఆర్డీవో శ్రీనివాస్, డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్, మండల వైద్యాధికారి అంజిత్‌రెడ్డి విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిలను గమనించి మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకున్నారు. విద్యార్థుల ఆరోగ్యం పర్యవేక్షిస్తూ ఎప్పటికప్పుడు కలెక్టర్‌కు సమాచారం అందించారు. రెండురోజుల నుంచి చికిత్స పొందుత్ను వారి ఆరోగ్యం కుదటపడడంతో శుక్రవారం వైద్యులు డిశ్చార్జి చేశారు.

వీధి కుక్కల దాడిలో గొర్రె పిల్లల మృతి



మృతి చెందిన గొర్రెలు

ధర్మారం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : వీధికుక్కల దాడిలో గొర్రె పిల్లలు మృతిచెందిన ఘటన మండలంలోని నర్సింగాపూర్‌లో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన బద్దం సుధాకర్‌రెడ్డి రాత్రి పడుకునే ముందు గొర్రెల మంద చుట్టూ కంచె ఏర్పాటు చేశాడు. గురువారం రాత్రి సమ యంలో వీధి కుక్కలు మందపై దాడి చేయడంతో 12 గొర్రెపిల్లలు మృతి చెందాయి. తనకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని సుధాకర్ రెడ్డి కోరాడు.

శిథిలమైనా.. చరిత్ర పదిలం

● గ్రామాల్లో కాకతీయులకాలం బురుజులు

● నాడు రక్షణ కేంద్రాలుగా కొనసాగిన కట్టడాలు

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు 20 ఆంధ్రజ్యోతి): కాకతీయుల కాలం నాటి బురుజులు శిథిలమైనా చరిత్రకు సజీవ సాక్ష్యంగా నిలుస్తున్నాయి. శత్రువుల రాకను పసిగట్టేందుకు నిర్మించిన కట్టడాలు ఆ నాటి వైభవానికి చిహ్నాలుగా గుర్తింపు పొందుతున్నాయి. సుమారు 900ఏళ్ల కిందట ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతోపాటు మండలంలోని నారాయణపూర్, సింగారం, పదిర, గొల్లపల్లి, తిమ్మాపూర్ తదితర గ్రామాల్లో బురుజులు నిర్మించారు. ఈ ఎత్తైన రాతి కట్టడాలు ఆనాడు రక్షణ కేంద్రాలుగా కొనసాగాయి. పలు గ్రామాల్లో శిథిలావస్థకు చేరినా కాకతీయుల నాటి కళా వైభావాన్ని చాటుతున్నాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత పలువురు చరిత్రకారులు బురుజుల ప్రత్యేకతను భవిష్యత్ తరాలకు అందించే ప్రయత్నం చేస్తున్నారు.



నారాయణపూర్‌లో శిథిలమైన బురుజు



పదిరలో ధ్వంసమైన బురుజు

● చరిత్రకు చిహ్నంగా..

ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతోపాటు మండలంలోని గొల్లపల్లి, పదిర, నారాయణపూర్, సింగా రం, తిమ్మాపూర్ గ్రామాల్లోని బురుజులు నాటి కళాకారుల ప్రతిభను చాటుతున్నాయి. శిథిలావస్థకు చేరుకున్నా కాకతీయుల కాలంలోని పాలన విధానాన్ని తెలియజేస్తున్నాయి. మండలకేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం పరిసరాల్లో నాలుగు బురుజులు ఉండేవి. ప్రస్తుతం రెండు కనుమరుగయ్యాయి. ఓ బురుజుకు మాజీ సర్పంచ్ నేవూరి వెంకటరెడ్డి మూడేళ్ల కిందట మరమ్మతు చేయించారు. ఆయన పదవి కాలంలో గణతంత్ర, స్వాతంత్ర దినోత్సవాలకు బురుజుపై జాతీయ జెండాను ఆవిష్కరించారు. నారాయణపూర్, సింగారం, తిమ్మాపూర్, గొల్లపల్లి, పదిర తదితర గ్రామాల్లోని బురుజులు శిథిలవస్థకు చేరుకున్నాయి. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు బురుజులను పరిరక్షించాలని, కాకతీయులకాలం నాటి సంపదను భవిష్యత్ తరాలకు అందించాలని ప్రజలు కోరుతున్నారు.

● ఎత్తైన రాతి కట్టడాలు.. సైనికుల పహారా కేంద్రాలు

ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతోపాటు మండలంలోని నారాయణపూర్, సింగారం, పదిర, గొల్లపల్లి, తిమ్మాపూర్ గ్రామాల్లో కాకతీయుల కాలంనాటి సామంత రాజైన సింగమమహారాజు బొప్పాపూర్ కేంద్రంగా రాచర్లకోటను నిర్మించారు. ఇక్కడి నుంచి పరిపాలన సాగించేవారని చరిత్ర కారులు, స్థానికులు చెబుతున్నారు. ఆయా గ్రామాల పరిధి, ప్రజల సంఖ్యకు అనుగుణంగా శత్రువులు దండయాత్ర చేయకుండా ఉండేందుకు ఎత్తైన రాతి కట్టడాలు చేపట్టారు. బురుజుల నిర్మాణానికి మట్టి, బరువైన రాళ్లను వినియోగించిన ఆనవాళ్లున్నాయి. బురుజు నిర్మాణంలో శత్రువులు రాకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. బురుజు పైకి ఎక్కేందుకు నేల నుంచి సుమారు రెండు అడుగుల ఎత్తులో ఒక్కరే వెళ్లేలా మెట్లను నిర్మించారు. నిచ్చెన సహాయంతో ఒక్కరిద్దరూ సైనికులు మాత్రమే పైకి ఎక్కిన తర్వాత నిచ్చెన తీసేసేలా కట్టడాలు ఉన్నాయి. బురుజుకు నాలుగు వైపుల మూడు నుంచి నాలుగు రంధ్రాలను ఏర్పాటు చేశారు. దూర ప్రాంతం నుంచి ఎవరైన వస్తున్నారా? అని సైనికులు చూసేవారు. శత్రువులు దండయాత్రకు వస్తే అందులో నుంచి తుపాకులతో కాల్చేవారు. బురుజు పైభాగంలోనూ నాలుగు వైపుల ఇటుకలు, మట్టితో గోడ, మధ్యలో రాళ్లతో ఓ గద్దె నిర్మించారు. దానిపై సైనికులు పహారా కాసేవారని చరిత్రకారులు చెబుతున్నారు. అంతేకాకుండా ఎండావాన నుంచి రక్షణగా ఓ షెడ్డులాంటిది ఏర్పాటు చేసుకున్న ఆనవాళ్లు కూడా ఉన్నాయి.



ఎల్లారెడ్డిపేటలోని బురుజు పైభాగంలో ధ్వంసమైన రాతికట్టడం



గొల్లపల్లిలోని బురుజు

బురుజులు అద్భుత కట్టడాలు



కాకతీయులు కాలంనాటి బురుజులు అద్భుత కట్టడాలు. మా ఊరిలో నాలుగు బురుజులుండేవని మా తాత చెబుతుండేవారు. ఇప్పుడు రెండు మాత్రమే ఉన్నాయి. వాటిని చూస్తే ఆశ్చర్యమేస్తోంది. మట్టి, పెద్దపెద్ద రాళ్లతో కట్టారు. ప్రస్తుతం శిథిలమవుతున్నాయి. అధికారులు స్పందించాలి. నాటి చరిత్ర భవిష్యత్ తరాలకు అందేలా చూడాలి.

- వనం రాజు, యువకుడు, ఎల్లారెడ్డిపేట

పర్యాటక ప్రదేశాలుగా తీర్చిదిద్దాలి



బురుజులను పర్యాటక ప్రదేశాలుగా తీర్చిదిద్దాలి. వాటి నిర్మాణానికి దేవాలయాలకు వినియోగించిన రాళ్లను వాడిన ఆనవాళ్ల కనిపిస్తాయి. దూరం నుంచి శత్రువుల కదలికలను కనిపెట్టేందుకు బురుజులు ఉపయోగపడ్డాయి. గ్రామాల్లోకి రజాకార్ల చొరబాటును ముందే కనిపెట్టి ఎదిరించేవారు. గ్రామాల్లోని ప్రజాప్రతినిధులు, అధికారులు, యువత ముందుకొచ్చి శిథిలావస్థకు చేరుకుంటున్న బురుజులకు మరమ్మతు చేపట్టాలి. స్వాతంత్ర, గణతంత్ర దినోత్సవం రోజున జాతీయ జెండాలను ఆవిష్కరించాలి. చరిత్రను భవిష్యత్ తరాలకు అందించాలి.

- రెడ్డి రత్నాకర్‌రెడ్డి, చరిత్రకారుడు

బురుజు మరమ్మతు చేపట్టాం



మా గ్రామంలోని బురుజు శిథిలావస్థకు చేరుకుంటే నాటి చరిత్రను కాపాడాలనే లక్ష్యంతో మరమ్మతు చేయించాం. బురుజుకు నాలుగు వైపుల త్రివర్ణ పతాకంలోని మూడు రంగులను వేయించి అందంగా తీర్చిదిద్దాం. బురుజుపై విద్యుద్దీపాలను ఏర్పాటు చేయించాం. ఏటా గణతంత్ర, స్వాతంత్ర దినోత్సవం రోజున జాతీయ జెండాను ఆవిష్కరించాం. పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టాం.

- మాజీ సర్పంచ్ నేవూరి వెంకట్‌రెడ్డి- ఎల్లారెడ్డిపేట

తప్పిపోయిన చిన్నారి

● వెతికి అప్పగించిన పోలీసులు



చిన్నారిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న సీఐ వీరప్రసాద్


వేములవాడ, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : వివాహ వేడుకలో పాల్గొనేందుకు తల్లిదండ్రులతో కలిసి వేములవాడకు వచ్చిన ఓ రెండేళ్ల హన్సిక అనే చిన్నారి తప్పిపోయిన ఘటనలో సదరు చిన్నారిని పోలీసులు క్షేమంగా తల్లిదండ్రులకు అప్పగించారు. వేములవాడ పట్టణ సీఐ వీరప్రసాద్ కథనం మేరకు.. జగిత్యాల జిల్లా కొడిమ్యాలకు చెందిన రమేష్-రమ్య దంపతులు గురువారం బంధువుల పెళ్లి కోసం వేములవాడకు వచ్చారు. రాత్రి బంధువుల ఇంటి వద్ద బస చేశారు. శుక్రవారం తెల్లవారుజామున బాలిక కనిపించకపోవడంతో ఆందోళనకు గురైన తల్లిదండ్రులు కుమార్తె కోసం వెతకడం ప్రారంభించారు. ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రభు అనే యువకుడు తనకు రెండేళ్ల పాప కనిపించినట్లు పోలీసులకు సమాచారం అందించి పాపను పోలీసులకు అప్పగించాడు. దీంతో పోలీసులు ఆ బాలికను తల్లిదండ్రులకు అప్పగించారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

ఫైటింక్లయిన్‌కాలనీ, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): రామగిరి మండలం సుందిల్ల గ్రామానికి చెందిన గిరుగల శ్రీకాంత్(18) వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. గోదావరిఖనిలోని పండ్ల దుకాణంలో పనిచేస్తున్న శ్రీకాంత్ ఈనెల 18న రాత్రి సుందిల్లకు ద్విచక్రవాహనంపై తిరిగి వస్తూ మార్గమధ్యలో విద్యుత్ పోల్‌ను ఢీకొన్నాడు. స్థానికుల సమాచారం మేరకు 108 సిబ్బంది శ్రీకాంత్‌ను గోదావరిఖని ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో వరంగల్ ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ శ్రీకాంత్ శుక్రవారం మృతి చెందాడు. మృతుడి సోదరుడు తిరుపతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు గోదావరిఖని టూటౌన్ పోలీసులు కేసునమోదు చేశారు.

కవిత్వాన్ని నడుపుతున్న ఖాలిద్...

● ఆటో డ్రైవర్‌గా ఉంటూ కవితల సృజన...



ఆటోలోనే కవిత్వం రాస్తున్న ఖాలిద్

కరీంనగర్ కల్చరల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ షాసాబ్ స్ట్రీట్‌లో నివసించే మహమ్మద్ ఖాలిద్ వృత్తి రీత్యా ఆటో డ్రైవర్. కవిత్వం సృజిస్తూ నటన, మిమిక్రి రంగాల్లోనూ ప్రతిభ చూపుతున్నారు. ఖాలిద్ 10వ తరగతివరకు మాత్రమే చదువుకున్నారు. ఆటో కొను క్కొని నడుపుతూ జీవనం వెళ్లదీస్తున్నారు. తెలంగాణరచయిత వేదిక ఆధ్వ ర్యంలో నిర్వహిస్తున్న ఎన్నీల ముచ్చట్ల ప్రభావంతో కవి కావాలనుకున్నారు. తీరిక సమయాల్లో కవితలు రాయడం ప్రారంభించారు. అలా ఆయన వంద కుపైగా కవితలు రాశారు. మనమంతా ఒక్కటే పేరుతో కవితా సంపుటిని వెలువరించారు. ప్రపంచ తెలుగు మహాసభల్లో తన కవిత్వాన్ని వినిపిం చారు. రోడ్డు సేఫ్టీ క్లబ్‌లో సభ్యుడిగా ఉంటూ హరితహారం, రోడ్డు భద్రతా వారోత్సవాలు, అవినీతి నిరోధక దినోత్సవం వంటి కార్యాక్రమాల్లో పాలు పంచుకున్నారు. పలు లఘు చిత్రాల్లో నటించారు. పలు పురస్కారాలు అందుకున్నారు.

కులం నుంచి వెలేసిన పెద్దలను శిక్షించండి

● మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్యాయత్నం

● సోషల్ మీడియాలో సెల్ఫీ వీడియో

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కుల పెద్దలు తన కుటుంబాన్ని కులం నుంచి వెలేశారని, మానసికంగా వేధిస్తున్నారని ఓ వ్యక్తి ఆత్మహత్యకు యత్నించగా విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మండల కేంద్రానికి చెందిన కొర్రి రమేశ్ గ్రామ శివారులోని ఓ చెట్టుకు ఉరి వేసుకుంటూ తీసిన సెల్ఫీ వీడి యో శుక్రవారం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఆ వీడియోలో తన కుటుంబాన్ని కుల పెద్దలు బహిష్కరించడంతో మానసికంగా కుంగిపోతున్నామని, కుల పెద్దల పేర్లు పేర్కొంటూ గోడును వెల్లబోసుకున్నాడు ఎస్పీ, డీఎస్పీ, సీఐ, ఎస్సై తనకు న్యాయం చేయాలని వేడుకున్నాడు. ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు.. మరో వైపు పోలీసులు రమేశ్ ఆత్మహత్యకు యత్నించిన ప్రదేశాన్ని తెలుసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పూర్తి వివరాలను అడిగి తెలుసుకున్నారు. బాధితుడి ఫిర్యాదుతో కుల పెద్దలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రమాకాంత్ తెలిపారు.

108 అంబులెన్స్‌లకు సుస్తీ

● వారాల తరబడి మరమ్మతులకు నోచుకోని వైనం ● అత్యవసర సమయాల్లో బాధితులకు తప్పని అవస్థలు

పెద్దపల్లిటౌన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : పెద్దపల్లి జిల్లాలోని 108 అంబులెన్స్‌లు మొరాయిస్తున్నాయి. మరమ్మతులకు నోచుకోకుండా వారాలు, నెలల తరబడి రిపేర్ షెడ్డులకే పరిమితమవుతున్నాయి. అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలు కాపాడే ఈ వాహనాలపై పట్టింపు కరువయ్యింది. దీంతో పక్క మండలాల అంబులెన్స్‌లపై ఆధారపడాల్సి వస్తోంది. సమయానికి అంబులెన్స్‌లు రాకపోవడంతో రోగులు, క్షతగాత్రులు అరచేతిలో ప్రాణాలు పెట్టుకుంటున్నారు. జిల్లాలో ఉన్న సగానికి పైగా వాహనాలను తరచూ మరమ్మతులు చేయిస్తూ నడిపిస్తున్నారు. జిల్లాలో వైద్య, ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్న కలెక్టర్ అంబులెన్స్‌లపై దృష్టి పెట్టకపోవడం గమనార్హం. జిల్లాలో 14 మండలాలకు 14 అంబులెన్స్‌లు ఉండాలన్నది ప్రభుత్వం ఉద్దేశ్యం. జిల్లాలో నూతనంగా వచ్చిన అంతర్గాం అంబులెన్స్‌తో పాటు ఒక నియోనాటల్, ఎనిమిది అంబులెన్స్‌లు ఉన్నాయి. జిల్లాలోని పెద్దపల్లి, కమాన్‌పూర్, రామగుండం, పాలకుర్తి, ధర్మారం, సుల్తానాబాద్, ఓదెల, కమాన్‌పూర్ మండలాలు అంబులెన్స్‌లు ఉన్నాయి. మండలానికి ఒక్క అంబులెన్స్ ఉండాల్సి ఉండగా, పది 108 అంబులెన్స్‌లు మాత్రమే రోగులను చేరవేస్తున్నాయి. ఇందులో చాలా వాహనాలు తరచూ మోరాయిస్తుండడంతో ఏడాది క్రితం ధర్మారం, మంథని, సుల్తానాబాద్, పాలకుర్తిల అంబులెన్స్‌ల స్థానంలో కొత్త 108 వాహనాలను ప్రభుత్వం కేటాయించింది. అయితే మిగతా అంబులెన్స్‌ల పరిస్థితి అలాగే ఉంది. ఒక్కో అంబులెన్స్ రోజుకు కనీసం మూడు నుంచి 10కేసులను కరీంనగర్, పెద్దపల్లి, వరంగల్ ఎంజీఎంకు తరలిస్తుంటాయి.

ఆయా మండలానికి సంబంధించి వాహనానికి సామర్థ్యానికి మించి కేసులు వస్తూ ఉంటా యి. రిప్లేస్ అయిన అంబులెన్స్‌లు కాకుండా మిగతావి కాలం చెల్లినవే ఎక్కువ ఉన్నాయి. కానీ వాటిని మర మ్మతు చేయిస్తూ కాలం వెల్లదీస్తున్నారు. వారాల తర బడి మరమ్మతులకు పంపించడంతో పక్క మండలాల వాహనాలపై భారం పడుతోంది. దీంతో రోగులను తరలించేందుకు అధిక సమయం పడుతోంది. రోగి పరిస్థితిని బట్టి బంధువులు ఆందోళన చెందాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి. వాహనంలో తరలించేటప్పుడు మధ్యలో మోరాయిస్తే పక్క మండలాల అంబులెన్స్‌లకు సమాచారం ఇవ్వాల్సి వస్తోంది. ఈ లెక్కన రోగులు, క్షతగాత్రులు, గర్భిణుల పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకోవచ్చు. ఇదిలా ఉండగా గోదావరిఖని, కమాన్‌పూర్‌లకు చెందిన వాహనాలను నెలరోజుల క్రితం స్క్రాప్‌నకు వేసేందుకు కరీంనగర్ షెడ్డులో ఉంచారు. వీటిని మరమ్మతులు చేయించి నడిపించేందుకు కానీ, వాటి స్థానంలో కొత్తవి తీసుకవచ్చేందుకు కానీ చర్యలు తీసుకోవడం లేదు. ఒదెల అంబులెన్స్ ఎటువెళ్లినా మరమ్మతులకు గురవుతోంది. వాహన బయలుదేరే ముందే అదే దారి వెంట లింకు అంబులెన్స్‌లకు సమాచారం ఇస్తూ వెళుతోంది. అయితే వరంగల్, కరీంనగర్ తరలించాలంటే ఆయా ప్రాంతాల వాహనాలకు లింక్‌చేసి పంపి స్తున్నారు. అవి ఎక్కువ దూరం నడిచే పరిస్థితి లేకపోవడం కారణంగా వాహనం బయలుదేరే ముందే అక్కడి వాహనాలకు సమాచారం ఇచ్చి రోగులను అందులోకి మార్చి ఆస్పత్రులకు తరలిస్తున్నారు. ఉదాహరణకు మంచిర్యాల నుంచి వరంగల్ ఎంజీఎమ్‌కు రోగులను తరలించాలంటే సుమారు ఐదారు అంబులెన్స్‌లు మార్చాల్సిన పరిస్థితి నెలకొంది.



మొరాయిస్తున్న అంబులెన్స్ (ఫైల్)



బాధితులను మరో వాహనంలోకి మార్చుతున్న సిబ్బంది(ఫైల్)

ఈక్రమంలో మార్గ మధ్యలో ఏన్నో సంఘటనలు చోటుచేసుకున్నా అవి బయటకు రావడం లేదు. ఇక్కడి పరిస్థితి ఇలా ఉండ గానే ప్రభుత్వం జిల్లాకు నాలుగు కొత్త అంబులెన్స్‌లను కేటాయించింది. అందులో ముత్తారం, జూలపల్లి, కాల్వశ్రీరాంపూర్, అంత ర్గాం మండలాలకు అంబు లెన్స్‌లను కేటాయించింది. అయితే అందులో అంతర్గాం మినహా మిగతా అంబు లెన్స్‌లన్నీ వెనక్కి పంపించారు. ఇప్పుడున్న అంబులెన్స్ లతో రోగుల ప్రాణాలకు భరోసా ఇవ్వలేని పరిస్థితి నెలకొంది. అత్యవసర పరిస్థితుల్లో ఆదుకునే అంబులెన్స్‌లపై ప్రభుత్వం ఎందుకు నిర్లక్ష్యం వహిస్తోందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తు న్నారు. దీనిపై అధికార యంత్రాంగం, జిల్లా ప్రజాప్రతి నిధులు ప్రత్యేక చొరవ చూపి కాలం చెల్లిన వాహనాల స్థానంలో కొత్త వాహనాలు, అలాగే మండలానికి ఒక అంబులెన్స్ కేటాయించాలని ప్రజలు కోరుతున్నారు.

● వాహనాలు పని చేయకపోతే ఉద్యోగికి గైర్హాజరు..

108 అంబులెన్స్‌లో ఒక పైలెట్, ఒక్క ఎమర్జెన్సీ మెడి కల్ టెక్నీషియన్ కలిపి ఇద్దరి చొప్పున ఉంటారు. 108 అంబులెన్స్‌లు మరమ్మతులకు గురై షెడ్డుకు వెళ్తే వీరికి వేతనాల్లో కోత ఉంటుంది. అత్యవసర పరిస్థితుల్లో పని చేసే ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కరువైందని వారు వాపోతున్నారు. రాత్రిపగలు తేడా లేకుండా నిత్యం పని చేసే తమపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం సరికాదని, వాహనాలను మార్చి తమకు నిత్యం పని కల్పించాలని వారు కోరుతున్నారు.

ఒకరి ఆత్మహత్య

హుజూరాబాద్‌రూరల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాంపూర్ గ్రామంలో సుంకరి రమేశ్(46) అనే వ్యక్తి శుక్రవారం ఉదయం కుటుంబ కలహాలతో మనస్తాపం చెంది ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రమేశ్‌కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. రెండేళ్లుగా భార్యతో గొడవలు జరుగుతుండడంతో ఇంటి వద్దనే ఉంటున్నాడు. ఇటీవల అనారోగ్యానికి గురవడంతో పరీక్షలు చేయించుగోగా క్యాన్సర్‌గా వైదుల్య నిర్ధారించారు. భార్య, పిల్లలు తనతో కలిసి ఉండాలని పలుమార్లు కుటుంబ సభ్యుల సమక్షంలో పంచాయితీ పెట్టిన వారు రాలేదు. దీంతో మనస్తాపానికి గురై ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రమేశ్ తల్లి కొమరమ్మ గమనించి ఇరుగు పొరుగు వారికి చెప్పడంతో పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి చేసుకుని వివరాలు సేకరించారు. కాగా తన ఆత్మహత్యకు భార్య జయ, ఇద్దరు కుమారులు, మామ, బావమరది కారణమంటూ సూసైడ్ నోట్ రాసి ఉన్నట్లు సమాచారం. రమేశ్ తల్లి కొమురమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మల్యాలలో అగ్నిప్రమాదం

మల్యాల, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): మల్యాల మండల కేంద్రంలోని ఒర్రెగడ్డ ప్రాంతంలో ఓ ఇంట్లో అగ్నిప్రమాదం జరిగి గృహోపకరణాల కాలిపోయాయి. సునిత అనే మహిళ తమ ఇంట్లో దేవుని ముందు దీపం వెలిగించి బయటకు వెళ్లింది. కొద్దిసేపటికి దీపం నుంచి మంటలు పెరిగి ఇంట్లో వ్యాపించాయి. దీంతో పెంకుటిల్లు పై కప్పునకు నిప్పు అంటుకుంది. సునిత ఇంటికి తిరిగి వస్తూ మంటలను గమనించి చుట్టుపక్కల వారికి తెలపడంతో ఆమెతో పాటు స్థానికులు మంటలను ఆర్పివేశారు. ఈ సంఘటనలో చిన్నపాటి గృహోపకరణాల దగ్ధం అయ్యాయి.

యువకుడి అదృశ్యం

సైదాపూర్, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): సైదాపూర్ మండలకేంద్రంలోని వెన్కేపల్లి గ్రామానికి చెందిన కామారపు శ్రీకాంత్(25) అనే యువకుడు అదృశ్యమయ్యాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీకాంత్ ఇంటి నుంచి గురువారం ఉదయం బైక్(టీఎస్02ఈకె1215))పై బయటకు వెళ్లాడు. ఇంటికి రాక పోవడంతో కుటుంబ సభ్యులు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. బంధువులు, తెలసిన వారిని అడిగినా ఆచూకీ లభించలేదు. దీంతో శుక్రవారం శ్రీకాంత్ తల్లి కామారపు బుచ్చవ్వ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. బుచ్చవ్వ ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తిరుపతి తెలిపారు.

రేపు ఉమ్మడి జిల్లాస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): సీఎంకప్ పోటీల నిర్వహణలో భాగంగా ఉమ్మడి జిల్లాస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలను ఆదివారం నిర్వహిస్తామని జిల్లా యువజన క్రీడాశాఖాధికారి బి శ్రీనివాస్‌గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రానికి సమీపంలోని అకాడమిక్ హైట్స్ పాఠశాల మైదానంలో పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. ఉమ్మడి జిల్లాలోని కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల జిల్లాల జట్లకు ఎంపికైన క్రీడాకారులు ఉదయం 10 గంటలకు మైదానంలో రిపోర్టు చేయాలని సూచించారు. పోటీల్లో ప్రతిభచాటే క్రీడాకారులను ఈ నెల 27 నుంచి హన్మకొండలో నిర్వహించే తెలంగాణ రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక చేస్తామని పేర్కొన్నారు.

జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైన వైష్ణవి



కోచ్ మధుకర్‌తో వైష్ణవి

సుల్తానాబాద్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ పట్టణానికి చెందిన ఖోఖో క్రీడాకారిణి జి. వైష్ణవి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. సుల్తానాబాద్‌లో ఏర్పాటు చేసిన ఖేలో ఇండియా శిక్షణా కేంద్రంలో అంతర్జాతీయస్థాయి ఖోఖో క్రీడాకారుడు, కోచ్ గెల్లు మధుకర్ ఆధ్వర్యంలో వైష్ణవి ఖోఖోలో శిక్షణ పొందుతోందని జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి సురేష్ తెలిపారు. ఈ మేరకు సుల్తానాబాద్‌లో జరుగుతున్న సీఎం కప్ జిల్లా స్థాయి పోటీలలో వైష్ణవిని ప్రత్యేకంగా అభినందించారు. ఈనెల 26 నుంచి 30వ తేదీ వరకు కేరళ రాష్ట్రంలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొననుందని ఆయన తెలిపారు. వైష్ణవిని గెల్లు మదుకర్‌తో పాటు సీఐ సుబ్బారెడ్డి, స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు ముస్త్యాల రవీందర్, అమిరిశెట్టి తిరుపతి, పెటా కార్యదర్శి దాసరి రమేష్ తదితరులు అభినందించారు.

క్రమబద్ధీకరణ అయ్యేదెన్నడో..?



వారంతా కాంట్రాక్టు లెక్చరర్లు. నిత్యం విద్యార్థులకు పాఠాలు చెబుతున్న వారు ఎప్పుడో ఒకప్పుడు తమ ఉద్యోగాలు రెగ్యులర్ కాకపోతాయా అనే ఆశతో ఎదురుచూస్తున్నారు. కాంట్రాక్టు లెక్చరర్లు కావడంతో వేతనాలు కూడా నెల నెలా అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా విధులు నిర్వహిస్తున్నా వారికి అందే వేతనాలు కూడా సరిగ్గా అందకున్నా నెట్టుకొస్తున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కాంట్రాక్టు లెక్చరర్ల క్రమబద్ధీకరణకు నిర్ణయం తీసుకుని ప్రక్రియ ప్రారంభించింది. రాష్ట్ర వ్యాప్తంగా కొంతమందిని రెగ్యులర్ చేసింది. ఖాళీ పోస్టుల లెక్కతేలిన అనంతరం మిగిలిన వారిని రెగ్యులర్ చేస్తామని హామీనిచ్చింది. అనంతరం ఎన్నికలు జరిగి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మరికొంత మందిని క్రమబద్ధీకరించింది. ఇంకా కొంత మంది కాంట్రాక్టు ఉద్యోగుల ఆశ మాత్రం తీరలేదు. దీంతో ప్రస్తుతం వారంతా ఆందోళన చెందుతున్నారు.

- జూనియర్ కాంట్రాక్టు లెక్చరర్ల ఎదురుచూపులు
- ఐదు నెలలుగా అందని వేతనాలు
- రాష్ట్రంలో 420 మంది కాంట్రాక్టు లెక్చరర్ల అవస్థలు

జగిత్యాల, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఎన్నోఏళ్లుగా పని చేస్తున్న కాంట్రాక్టు లెక్చరర్లకు.. తమఉద్యోగాల క్రమ బద్ధీకరణ (రెగ్యులరైజేషన్) కోసం ఎదురుచూపులు తప్పడం లేదు. కాంట్రాక్టు లెక్చరర్ల కొలువులను క్రమ బద్ధీకరించే ప్రక్రియ ప్రారంభించి రెండేళ్లు పూర్తయినా ఇంతవరకు సగం మంది ఆశలు కూడా నెరవేరలేదు. ప్రభుత్వ డిగ్రీ, పాలిటెక్నిక్, జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ లెక్చరర్ల క్రమబద్ధీకరణకు గత ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఆమేరకు రాష్ట్రంలో 3,538 మంది కాంట్రాక్ట్ లెక్చరర్లు ఉండగా, గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2023 మే మొదటి వారంలో 3,093 మందిని క్రమ బద్ధీకరించింది. పోస్టులు లేవనే కారణంతో మిగిలిన 445మంది జూనియర్ కాంట్రాక్ట్ లెక్చరర్లను క్రమబద్ధీకరించకుండా నిలిపివేసింది. ఖాళీ పోస్టుల లెక్క తేలిన అనంతరం మిగిలిన వారిని రెగ్యులర్ చేస్తామని హామీనిచ్చింది. ఈలోపు ఎన్నికల కోడ్ రావడంతో క్రమ బద్ధీకరణ కాలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కొంత మంది అధికారులు పోస్టులు లేవంటూ ప్రభుత్వానికి తప్పుడు నివేదికలు ఇవ్వడంవల్ల తమకు అన్యాయం జరిగిందని వాపోతున్నారు. అయితే రాష్ట్రంలో ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం గత నెలలో 25మంది జూనియర్ కాంట్రాక్ట్ లెక్చరర్లను క్రమబద్ధీకరించింది. ఇంకా 420 మంది కాంట్రాక్టు లెక్చరర్ల ఉద్యోగాలు రెగ్యులరైజ్ కావాల్సి ఉందంటు న్నారు. ఈ నేపథ్యంలో కాంట్రాక్ట్ ఉద్యోగు లను రెగ్యులర్ చేయొద్దని, ఇప్పటికే రెగ్యులర్ చేసిన వారిని తొలగించ వద్దు అని ఇటీవల కోర్టు తీర్పు ఇవ్వడంతో తమ ఉద్యో గాలు రెగ్యులరైజ్ అయ్యే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం కరుణించి ఏళ్ల తరబడి విధులు నిర్వహిస్తున్న తమ ఉద్యోగాలను రెగ్యులర్ చేసి ఆదుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరుతున్నారు.



మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతి పత్రం అందిస్తున్న కాంట్రాక్ట్ లెక్చరర్లు

● ఐదు నెలలుగా అందని వేతనాలు..

చాలీచాలని జీతాలతో అనేక సంవత్సరాలుగా విద్యార్థులకు బోధిస్తున్న కాంట్రాక్ట్ జూనియర్ లెక్చరర్లను ఐదు నెలలుగా జీతాలు రాకపోవడంతో భార్యా పిల్లలను ఎలా పోషించుకోవాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జూలై 2024 నుంచి వేతనాలు అందడం లేదంటున్నారు. సాఫ్ట్‌వేర్‌లో సాంకేతిక సమస్యలవల్ల వేతనాలు అందడం లేదని వాపోతున్నారు.



జగిత్యాల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బోధన చేస్తున్న కాంట్రాక్టు లెక్చరర్

కాంట్రాక్టు లెక్చరర్లను క్రమబద్ధీకరించాలి



17 ఏళ్లుగా చాలీచాలని వేతనంతో పనిచేస్తున్నాను. మా తోటివారిని గత ప్రభుత్వం క్రమబద్ధీకరించి అన్ని అర్హతలు ఉన్నప్పటికీ మమ్మల్ని రెగ్యులర్ చేయకుండా నిలిపివేసింది. ఇప్పటికైనా మాపై దయ చూపి ముఖ్యమంత్రి వెంటనే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులర్ చేయాలని వేడుకుంటున్నాను.

- నలువాల శ్రీనివాస్, కాంట్రాక్టు లెక్చరర్, జగిత్యాల

వేతనాలు సక్రమంగా అందించాలి



రాష్ట్రంలో జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న కాంట్రాక్టు లెక్చరర్ల ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేయాలి. ఏళ్ల తరబడి పనిచేస్తున్నప్పటికీ ఉద్యోగాలు రెగ్యులరైజ్ కాకపోవడం వల్ల మానసికంగా ఆందోళనకు గురవుతున్నాము. అయిదు నెలలుగా వేతనాలు అందకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాము. వేతనాలు ఏ నెలకు ఆ నెల సక్రమంగా అందించాలి.

- శంకరయ్య, కాంట్రాక్టు లెక్చరర్, జగిత్యాల

జిల్లా మహిళలకు రాష్ట్రస్థాయి మిద్దెతోట అవార్డు



దుబ్బాక వనజ

కరీంనగర్ కల్చరల్/జమ్మికుంట, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు చెందిన ఇద్దరు మహిళలు రాష్ట్రస్థాయి మిద్దెతోట అవార్డుకు ఎంపికయ్యారు. తుమ్మేటి రఘోత్తంరెడ్డి రైతు నేస్తం మిద్దెతోట పురస్కారానికి కరీంనగర్‌కు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయురాలు దుబ్బాక వనజ, జమ్మికుంటకు చెందిన పుల్లూరి వెంకట రాజ్యలక్ష్మి ఎంపికయ్యారు. సేంద్రియ పద్ధతిలో కూరగాయలు, పండ్లు, పూల సాగు చేస్తున్న మిద్దెతోట రైతులను ప్రోత్సహించడానికి రైతు నేస్తం ఫౌండేషన్ ప్రతీ యేటా పురస్కారాలు ప్రదానం చేస్తోంది. ఈ నెల 23న గుంటూరులో జరిగే సభలో వీరు పురస్కారాన్ని అందుకోనున్నారు. పురస్కా రానికి ఎంపికయిన వనజను సిటీ టెర్రస్ గార్డెన్ సభ్యులు ప్రణీత, అపర్ణ, స్వాతి మధు, భారతి, లావణ్య, శిరీష, మమత, వి సమత అభినందించారు. ఈ సందర్భంగా వనజ మాట్లాడుతూ ప్రకృతి ప్రేమికురాలిగా దశాబ్ద కాలంగా చేస్తున్న పనికి గుర్తింపు వచ్చిందన్నారు. రసాయనాలు లేని ఆహారం పొందడానికి తాను చిరు ప్రయత్నం చేశానని తెలిపారు.



పుల్లూరి వెంకటలక్ష్మి

జమ్మికుంటకు చెందిన పుల్లూరి వెంకటలక్ష్మి మాట్లాడుతూ ఐదేళ్లుగా తాము మిద్దె తోట నిర్వహిస్తున్నామన్నారు. సేంద్రియ పద్ధతిలో తాము కూరగాయలు, ఆకుకూరలు పండిస్తు న్నామని చెప్పారు. తమకు ప్రేరణ కలిగించిన తుమ్మేటి రఘోత్తంరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఆయన పేరిట ఇచ్చే అవార్డును తనను ఎంపిక చేసిన రైతునేస్తం ఫౌండేషన్‌కు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

దోపిడీ ముఠా అరెస్టు

- రూ.5 లక్షల విలువ గల బంగారం, 10 వేల నగదు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఎస్పీ అశోక్‌కుమార్

జగిత్యాల అర్బన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): బీర్‌పూర్ మండల కేంద్రంలో ఈ నెల 13వ తేదీన దోపిడీకి పాల్పడిన దొంగల ముఠాను అరెస్టు చేసినట్లు ఎస్పీ అశోక్‌కుమార్ శుక్రవారం వెల్లడించారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ మున్నీసుల శ్రీనివాస్, చిప్పబత్తుల తులసయ్య, బక్కనపల్లి అరుణ్, యశోద శ్రీనివాస్, సైదు సహదేవ్, రత్నం మాణిక్యం, ముగునూరి కిరణ్ కుమార్ ఒక గ్యాంగ్‌గా ఏర్పడ్డారు. కొన్ని రోజుల నుంచి గుప్త నిధుల కోసం గాలిస్తున్నారు. ఎక్కడా గుప్త నిధులు దొరకకపోవడంతో ఎలాగైనా డబ్బులు సంపాదించాలని భావించారు. ఈ క్రమంలో బీర్‌పూర్‌లో డబ్బులు, బంగారం ఉన్న కాసం ఈశ్వరయ్య ఇంటిని దొంగతనానికి ఎంచుకున్నారు. ఇద్దరు వృద్ధులు ఇంట్లో ఉన్నారని తెలుసుకుని 13వ తేదీన రాత్రి మంకీ క్యాప్‌లు ధరించి, బొమ్మ తుపాకీలు పట్టుకుని కిరణ్‌కుమార్, అరుణ్, తులసయ్య, మునీశ్వర్, శ్రీనివాస్‌లు నెంబర్ లేని రెండు ద్విచక్ర వాహనాలపై అర్ధరాత్రి కాసం ఈశ్వరయ్య ఇంటికి వెళ్లి అతడిపై దాడి చేశారు. అతడి భార్యను కొట్టి నోట్లో గుడ్డలు కుక్కి, బంగారంతో పాటు ఇంట్లో ఉన్న డబ్బులు తీసుకుని తుమ్మెనాలకు వెళ్లినట్లు ఎస్పీ తెలిపారు. దొంగలు ధర్మపురి మండలం తుమ్మెనాల గుట్ట వద్ద ఉన్నారని తెలుసుకున్న పోలీసులు డీఎస్పీ రఘుచందర్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి శుక్రవారం ఆరుగురు దొంగలను అరెస్టు చేసినట్లు ఎస్పీ తెలిపారు. వారి వద్ద రూ.5 లక్షల విలువ గల బంగారం, రూ.10 వేల నగదు, రెండు బొమ్మ తుపాకులు, 6 సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. చాకచక్యంతో దొంగలను పట్టుకున్న సీఐ కృష్ణారెడ్డి, ఎస్సైలు కుమార స్వామి, సుధాకర్, శ్రీధర్ రెడ్డి, దత్తాత్రేయ, హెడ్ కానిస్టేబుల్ గంగాధర్ తదితరులను ఎస్పీ అభినందించి, ప్రోత్సాహకరంగా నగదును అందించారు.



మాట్లాడుతున్న ఎస్పీ అశోక్‌కుమార్

డయల్ యువర్ ఆర్ఎంకు స్పందన



సమస్యలు వింటున్న ఆర్ఎం బి రాజు

భగత్‌నగర్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన డయల్ యువర్ ఆర్ఎం కార్యక్రమానికి స్పందన లభించింది. ఆర్టీసీ కరీంనగర్ రీజినల్ మేనేజర్ బి రాజు ప్రయాణికుల నుంచి వచ్చిన ఫోన్ కాల్స్‌ను స్వీకరించారు. మొత్తం 14 ఫోన్ కాల్స్ వచ్చాయని, వీటిని పరిశీలించి పరిష్కారం కోసం సంబంధిత డిపో మేనేజర్లకు ఆదేశాలు జారీ చేస్తామని వివరించారు. సలహాలు, సూచనలు అందించిన ప్రయాణికులకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

వాహనదారుల చెంతకే పెట్రోల్, డీజిల్

- ఊరూరా తిరిగి క్యాన్ల ద్వారా సరఫరా చేస్తున్న డెలివరీ బాయ్స్



ఖాసీంపేటలో ద్విచక్ర వాహనదారులకు పెట్రోలు పోస్తున్న డెలివరీ బాయ్

గన్నేరువరం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): గన్నేరువరం మండలం హైవేకు దూరంగా ఉంటుంది. ప్రజా రవాణా సౌకర్యమూ తక్కువగానే ఉంటుంది. ఏ అవసరం వచ్చినా ప్రజలు సొంత వాహనాలపైనే కరీంనగర్ తదితర ప్రాంతాలకు వెళుతుంటారు. వ్యవసాయానికి ట్రాక్టర్లూ పెద్ద సంఖ్యలోనే వినియోగిస్తుంటారు. మండలంలో పెట్రోల్ బంక్‌లు సరిపడా లేకపోవడంతో వాహనదారులు తీవ్రంగా ఇబ్బందిపడుతున్నారు.

దీన్ని గమనించిన ఓ వ్యాపారి పెట్రోల్, డీజిల్‌ను డోర్ డెలివరీ చేయడం ప్రారంభించాడు. మండలంలోని పారువెల్ల, ఖాసీంపేట, యాస్వాడ, గన్నేరువరం, మైలారం, మాదాపూర్, హన్మాజిపల్లి, గోపాల్‌పూర్, జంగపల్లి గ్రామాలకు ఆటో ట్రాలీలో 5, 10, 20, 40 లీటర్ల క్యాన్ల ద్వారా పెట్రోల్, డీజిల్‌ను తీసుకువస్తాడు. బంక్‌లో ధరకంటే ఒక్కో లీటర్‌కు అదనంగా ఒక రూపాయి తీసుకొని ఫోన్ చేసిన వారికి ఇంటి వద్దకు వచ్చి సరఫరా చేస్తున్నారు. దీంతో రైతులు తమ ట్రాక్టర్లకు పెద్ద మొత్తంలో అవసరం పడే డీజిల్‌ను ఒక్క ఫోన్ కాల్‌తో ఇంటి వద్దనే పొందుతున్నారు. ఆయా గ్రామాల్లోని ద్విచక్ర వాహనదారులు పెట్రోల్ బంకులకు వెళ్లకుండా వారి ఇంటి వద్దనే పెట్రోల్‌ను కొంటున్నారు. ఈ పద్ధతితో తమ ఇబ్బందులు తీరాయని మండల వాసులు అంటున్నారు.



గన్నేరువరంలో రైతులకు డీజిల్ విక్రయిస్తున్న డెలివరీ బాయ్

● సమయం ఆదా అవుతుంది..



ఒక్క ఫోన్ చేయగానే ఇంటి వద్దకు వచ్చి పెట్రోల్, డీజి ల్‌ను సరఫరా చేయడం వల్ల మాకు సమయం ఆదాఅవుతుంది. మా గ్రామానికి దగ్గరలో బంక్ లేకపో వడంతో గతంలో వేరే ప్రాంతాల్లోని బంక్‌కు వెళ్లి క్యాన్లలో తెచ్చుకునే వాళ్లం. దీంతో చాలా సమయం వృథా అయ్యేది. ఇప్పుడు డోర్ డెలివరీ సేవలతో సమయం ఆదా అవుతుంది. లీటర్‌కు ఒక్క రూపాయే అదనంగా తీసుకుంటుండడంతో పెద్దగా భారం పడడం లేదు.

- తోట రాజేందర్, రైతు, మైలారం,

ఘనంగా వేంకటేశ్వర కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

రాయికల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాయికల్ పట్టణంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం వేంకటేశ్వర స్వామి-పద్మావతిల కల్యాణం కన్నుల పండువగా జరిగింది. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య నిర్వహించిన ఈ కల్యాణానికి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు మచ్చ నారాయణ, ఉపాధ్యక్షుడు ఏనుగు మల్లారెడ్డి, జనరల్ సెక్రటరీ మచ్చ గంగాధర్, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, బాలె శేఖర్, తుమ్మల సదాశివా రెడ్డి, కౌన్సిలర్ కన్నాక మహేందర్, పురోహితులు శ్రీకాంత్, వేణుగోపాల స్వామి పాల్గొన్నారు.

ఆర్టీసీ రాయితీలు వినియోగించుకోవాలి

భగత్‌నగర్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ అందిస్తున్న రాయితీలు, పథకాలను ప్రయాణికులు వినియోగించుకోవాలని ఆర్టీసీ రీజినల్ మేనేజర్ బి రాజు అన్నారు. శుక్రవారం కరీంనగర్ బస్‌స్టేషన్ ఆవరణలో కరీంనగర్ రీజియన్‌లోని 11 డిపోల పరిధిలోని విలేజ్ బస్ ఆఫీసర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ అందిస్తున్న పథకాలు రాయితీలపై విలేజ్ బస్ ఆఫీసర్లు ప్రయాణికులకు, ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఆర్టీసీ ఆధ్వర్యంలో అద్దె ప్రాతిపదికన అందిస్తున్న బస్సు ఛార్జీలను గణనీయంగా తగ్గించిన నేపథ్యంలో అద్దె బస్సులు బుక్ చేసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అరుణాచలం క్షేత్రానికి ప్రత్యేక చొరవ చూపి రెండు బస్సులను బుక్ చేయించిన హుస్నాబాద్ డిపో విలేజ్ బస్ ఆఫీసర్ వీజే రెడ్డి, అద్దె బస్సులను ఎక్కువగా బుక్ చేసినందుకు గాను కరీంనగర్‌కు చెందిన వీఎల్ నారాయణను శాలువాతో సత్కరించారు. సమావేశంలో డిప్యూటీ రీజినల్ మేనేజర్ (ఆపరేషన్స్) ఎస్ భూపతిరెడ్డి యాభై మంది బస్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ



రాజన్నను దర్శించుకుంటున్న భక్తులు

వేములవాడ కల్చరల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామివారి క్షేత్రంలో శుక్రవారం భక్తుల రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. రాజన్నకు ప్రీతిపాత్రమైన కోడెమొక్కు చెల్లించుకున్నారు. అనబంధ ఆలయాల్లో కుంకుమ పూజల్లో పాల్గొన్నారు. బద్దిపోచమ్మ అమ్మవారిని దర్శించుకొని తిరుగుపయనమయ్యారు.

రాజన్న సేవలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడు

వేములవాడ రాజరాజేశ్వరస్వామిని ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడు కొంకటి లక్ష్మీనారాయణ శుక్రవారం దర్శించుకున్నారు. అనంతరం నాగిండ్డి మండపంలో అర్చకులు ఆశీర్వచనం, ఆలయ ఏఈవో, పీఆర్వో రాజన్న ప్రసాదాన్ని అందజేశారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ తిరుపతిరావు, ఆలయ ఇన్‌స్పెక్టర్ రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల మరణాలకు సీఎం బాధ్యత వహించాలి



మాట్లాడుతున్న ఏబీవీపీ రాష్ట్ర హాస్టళ్ల కన్వీనర్ రంజిత్‌కుమార్

గణేష్‌నగర్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గురుకుల హాస్టల్ విద్యార్థుల మరణాలకు ముఖ్యమంత్రి బాధ్యత వహించాలని ఏబీవీపీ రాష్ట్ర హాస్టల్స్ కన్వీనర్ మారవేని రంజిత్‌కుమార్ అన్నారు. శుక్రవారం నగరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇందిరమ్మ రాజ్యం అంటే గురుకుల విద్యార్థులు పిట్టల్లా రాలిపోవడమేనా అని ప్రశ్నించారు. మెట్‌పల్లి పెద్దాపూర్ గురుకులంలో నాలుగు నెలల్లో ఎనిమిది మంది విద్యార్థులు పాము కాటుకు గురైతే ఇద్దరు మరణించారన్నారు. ఉపముఖ్యమంత్రి హాస్టల్‌కు వచ్చి సమస్యలు పరిష్కరిస్తామని చెప్పినా ఆచరణకు నోచుకోలేదని తెలిపారు. హాస్టల్స్ సమస్యలపై హైకోర్టు జడ్జితో విచారణ చేపట్టాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ పూసల విష్ణు, బామాండ్ల నందు, శ్రీవర్ధన్, యోగేష్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

రేపు ట్రినిటీ రామానుజన్ ఒలింపియాడ్ టెస్ట్



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ట్రినిటీ విద్యాసంస్థల వ్యవస్థాపక అధ్యక్షుడు దాసరి మనోహర్‌రెడ్డి, కళాశాలల ప్రిన్సిపాళ్లు

కరీంనగర్ టౌన్, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): ప్రముఖ గణితశాస్త్రవేత్త రామానుజన్ జన్మదినం పురస్కరించుకొని పదోతరగతి విద్యార్థులకు ట్రినిటీ రామానుజన్ ఒలింపియాడ్ టెస్ట్‌ను ఆదివారం నిర్వహిస్తున్నట్లు ట్రినిటీ విద్యాసంస్థల ఫౌండర్ చైర్మన్ దాసరి మనోహర్‌రెడ్డి, చైర్మన్ ప్రశాంత్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కరీంనగర్, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా పరిధిలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఈనెల 10 నుంచి 18వ తేదీ వరకు లెవల్-1 పరీక్షను నిర్వహించగా 12,356 మంది పరీక్ష రాశారని అన్నారు. వారిలో 2,368 మంది విద్యార్థులు లెవల్-2కు అర్హత సాధించారని, వారికి ఈనెల 22న ఒలింపియాడ్ టెస్ట్‌ను నిర్వహిస్తామన్నారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ట్రినిటీ ప్రైమ్ క్యాంపస్, ఏసీ బాయ్స్ క్యాంపస్, ఏసీ గర్ల్స్ క్యాంపస్‌లలో పరీక్ష నిర్వహిస్తామని అన్నారు. లెవల్-2 పరీక్షలో ఉత్తమప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మొదటి బహుమతిగా 10వేల రూపాయలు, ద్వితీయ బహుమతిగా 7,500, తృతీయ బహుమతిగా 5,000, నాలుగో బహుమతిగా 3,000, ఐదో బహుమతిగా 2,000, ఆరు నుంచి 10 ర్యాంకుల వారికి 1,500, 20 మందికి 1,000 రూపాయల చొప్పున బహుమతులను ప్రధానం చేయడంతోపాటు మెడల్, మెమోంటో, ప్రశంసాపత్రాలను అందజేస్తామని ప్రకటించారు. దీంతో పాటు లెవల్-2 పరీక్షల్లో 80 శాతం మార్కులు సాధించిన విద్యార్థులకు కళాశాలలో 10 నుంచి 100శాతం వరకు ఫీజు రాయితీ ఇస్తామని చెప్పారు. ఈ అవకాశాన్ని పదోతరగతి విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

న్యూస్ బాక్స్

ఉచిత షుగర్ పరీక్షలు

ధర్మారం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ధర్మారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత డయాబెటిస్ పరీక్ష శిబిరం నిర్వహించారు. శుక్రవారం స్థానిక శ్యామల నర్సింగ్‌హోమ్‌లో నిర్వహించిన క్యాంపులో 265 మందికి షుగర్ పరీక్షలు నిర్వహించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు తలమక్కి రవీందర్ శెట్టి, సెక్రెటరీ ఎండి ముజాయిద్, ట్రెజరర్ కట్ట రమేష్, నాడెం శ్రీనివాస్, బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ చింతపండు నర్సింగం, సభ్యులు చంద్రయ్య, మనోహర్, సేవాదళ్ జిల్లా అధ్యక్షులు బొల్లి స్వామి, ఓరం చిరంజీవి పాల్గొన్నారు.

ఆర్మీ కెప్టెన్‌కు సన్మానం

కాల్వశ్రీరాంపూర్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెగడపల్లిలో శుక్రవారం గ్రామానికి చెందిన పత్తి జీవన్‌రెడ్డి ఆర్మీలో కెప్టెన్‌గా పదోన్నతి పొందడంపై మాజీ ఎంపీపీ గోపగోని సారయ్యగౌడ్‌తో పాటు గ్రామస్థులు సన్మానించారు. పంజాబ్‌లో ఆర్మీలో విధులు నిర్వహిస్తూ స్వగ్రామానికి వచ్చిన సందర్భంగా గ్రామస్థులు సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఆరెల్లి సుజాతరమేష్, పత్తి శ్రీనివాస్‌రెడ్డి, జంగా రమణారెడ్డి, నక్కల కొమురయ్య, తింగిలి మాల్‌రెడ్డి, బెజ్జ రాజేశం, నాగుల నారాయణ, కొండ రాజ్‌కుమార్, జంగా మధూసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాహుల్ దిష్టిబొమ్మ దహనం

జూలపల్లి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో బీజేపీ మండల అధ్యక్షుడు కొప్పుల మహేష్ ఆధ్వర్యంలో రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను శుక్రవారం దహనం చేసారు. బీజేపీ ఎంపీ ప్రతాప్ సారంగిపై కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకుడు రాహుల్ గాంధీ దాడి చేయడాన్ని ఖండించారు. కాంగ్రెస్ పార్టీ, రాహుల్ గాంధీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సంకెండ్ల నర్సయ్య, బొజ్జ సంపత్, కొమ్ము ఐలయ్య, గుమ్మడి శంకరయ్య, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు క్రిస్మస్ వేడుకలు

మంథని, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని శ్రీరాంనగర్ సీయోను ప్రార్థన మందిరంలో శుక్రవారం ముందస్తు క్రిస్మస్ కేక్‌కట్ చేసి క్యారల్స్ నిర్వహించారు. కార్యక్రమంలో ఐఎంఏ సెక్రెటరీ అంకరి కుమార్, పాస్టర్లు అజ్మీరా దయారాజ్, దూడ మహేష్, మంథని మార్కు, రాజేష్, సంఘ పెద్దలు జోసెఫ్, ప్రసాద్, ప్రేమ్‌కుమార్, రమేష్, సదానందం,కుమార్, మల్లారెడ్డి,జాన్, స్వామి, రాజేశం,సుమంత్‌రాజ్ పాల్గొన్నారు.

ఎంపీడీవోకు వినతి

కమాన్‌పూర్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఆదివరాహస్వామి గుడికి వెళ్లే దారికి వారసంతను మార్చాలని కోరుతూ శుక్రవారం బీఆర్ఎస్ నాయకులు ఎంపీడీవో లలితకు వినతిపత్రం సమర్పించారు. గతంలో చిన్నగా ఉన్న సంత ప్రధాన రోడ్లపై పూర్తిగా విస్తరించిందని, దీంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని చర్యలు తీసుకోవాలన్నారు. దీనిపై కలెక్టర్‌కు సైతం వినతి పత్రం సమర్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల కన్వీనర్ తాటికొండ శంకర్, మండల యువత అధ్యక్షుడు బొమ్మగాని అనిల్‌గౌడ్, మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ గుర్రం లక్ష్మీమల్లు, జూలపల్లి మాజీ ఉప సర్పంచ్ సాయికుమార్, రాజ్‌కుమార్, ఎలబోయిన రామ్మూర్తి ఉన్నారు.

ఉద్యమకారుల ఫోరం జిల్లా ఉపాధ్యక్షుడిగా మల్లేష్

ఎలిగేడు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ధూళికట్టకు చెందిన మారం మల్లేష్‌ను ఉద్యమకారుల ఫోరం జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమించారు. ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు చీమ శ్రీనివాస్, కన్వీనర్ గుండేటి ఐలయ్య నియామక పత్రాన్ని అందజేశారు. తన నియామకానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికి మల్లేష్ కృతజ్ఞతలు తెలిపారు.

టీఎన్జీవోల సభ్యత్వ నమోదు



సభ్యత్వ నమోదులో పాల్గొన్న టీఎన్జీవోలు

పెద్దపల్లిటౌన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఎన్జీవోల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. మొదటగా ఇరిగేషన్ సర్కిల్ పెద్దపల్లి కార్యాలయం, ఇరిగేషన్ డివిజన్ నంబర్ 5డివిజన్ కార్యాలయం, జిల్లా ఖజానా కార్యాలయంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. జిల్లా అధ్యక్షుడు, జేఏసీ చైర్మన్ బొంకూరి శంకర్ మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల కోసం టీఎన్జీవోల సంఘం నిర్విరామంగా పనిచేస్తుందని తెలిపారు. ప్రతి ఉద్యోగి సమస్యను తీర్చడానికి టీఎన్జీవోల సంఘం ముందుంటుందన్నారు. పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం సంఘం నిర్విరామంగా పనిచేస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో డీటీవో కరుణాకర్, ఎన్‌టీపీ ఏ సత్యనారాయణ, తెలంగాణ ఎన్జీవోల సంఘం నాయకుడు శ్రీనివాస్, ఎడ్ల కొమురయ్య, ఉపాధ్యక్షుడు రాజయ్య, పట్టణ కార్యదర్శి ప్రవీణ్, అజయ్, రాజప్రసాద్, అశోక్, రామేశ్వర్ గణపతి తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీపీసీలో సీఐటీయూ నిరసన

జ్యోతినగర్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : కేంద్రంలోని ఎన్‌డీఏ సర్కారు చర్యలకు వ్యతిరేకంగా ఎన్టీపీసీప్లాంటు వద్ద సీఐటీయూ అనుబంధ ఇండస్ట్రియల్ వర్కర్స్ యూనియన్ శుక్రవారం నిరసన వ్యక్తం చేసింది. రాష్ట్రాల హక్కులను కేంద్రం హరిస్తోందని, కేరళలోని వామపక్ష ప్రభుత్వాన్ని ఇబ్బదుల పాలు చేస్తోందని ఆరోపిస్తూ నిరసన ప్రదర్శన, కరపత్రాలు పంపిణీ చేశారు. అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ కేరళ ప్రభుత్వంపై ఎన్‌డీఏ ప్రభుత్వం రాజకీయ దాడి చేస్తున్నదని, రాష్ట్రానికి రావాల్సిన నిధులను ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో రాఘవరెడ్డి, మల్లేశ్, ఎండి.యాకూబ్, కనకయ్య, మల్లయ్య, సంపత్, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

బాలికల రక్షణ కోసమే షీ టీంలు : ఏసీపీ రమేష్


సదస్సులో ప్రసంగిస్తున్న గోదావరిఖని ఏసీపీ రమేష్

జ్యోతినగర్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : బాలికల రక్షణ కోసమే పోలీసు శాఖ షీ టీంలను ఏర్పాటు చేసిందని గోదావరిఖని ఏసీపీ ఎం.రమేష్ అన్నారు. శుక్రవారం ఎన్టీపీసీ టీటీఎస్ జెడ్పీ పాఠశాలలో షీం టీ, ఆన్‌లైన్ మోసాలు, యాంటీ డ్రగ్స్‌పై నిర్వహించిన అవగాహనా సదస్సులో ఏసీపీ ప్రసంగించారు.మహిళల రక్షణ కోసం ప్రతి రోజు బస్టాండు, విద్యా సంస్థలు, ప్రధాన కూడళ్ల వద్ద షీటీంలను ఏర్పాటు చేశామన్నారు.ఎవరైనా వేధిస్తే నిర్భయంగా 6303923700 నెంబరుకు కాల్ చేసి సమస్య గురించి చెప్పాలని, సమస్య చెప్పిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. రామగుండం సీఐ ప్రవీణ్ కుమార్, ఎన్టీపీసీ ఎస్ఐ ఉదయ్‌కిరణ్, షీ టీం ఇన్‌చార్జి ఏఎస్ఐ మల్లయ్య, షీ టీం సభ్యులు సురేష్, స్నేహలత, సీడీపీవో అలేఖ్య పటేల్, డిహెచ్‌ఇడబ్ల్యు సంధ్య, ఎఫ్ఆర్‌వో స్వర్ణలత, పాఠశాల హెచ్‌ఎం జయరాజ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సుల్తానాబాద్ సహకార సంఘం సేవలు భేష్..

- నాబార్డు సీజీఎం ఉదయ బాస్కర్


పాక్స్ అభివృద్ధి గురించి తెలుసుకుంటున్న సీజీఎం ఉదయ భాస్కర్

సుల్తానాబాద్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : సుల్తానాబాద్ సహకార సంఘం ఆధ్వర్యంలో రైతులకు రుణాలు ఇవ్వడంతో పాటు పలు రకాల సేవలు అందించడం అభినందనీయమని నాబార్డు చీఫ్ జనరల్ మేనేజర్ ఉదయ బాస్కర్ అన్నారు. సహకార సంఘాన్ని శుక్రవారం నాబార్డు సీజీఎం ఆధ్వర్యంలోని ఉన్నత స్థాయి అధికారుల బృందం సందర్శించింది. రైతులకు అందజేస్తున్న సేవల గురించి తెలుసుకున్నారు. సింగిల్‌విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్, సీఈఓ బూరుగు సంతోష్‌లు సంఘ అభివృద్ధి గురించి, సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వ్యాపారాల గురించి నాబార్డు బృందానికి వివరించారు. అనంతరం నాబార్డు సీజీఎం ఉదయ భాస్కర్ విలేకరులతో మాట్లాడుతూ సుల్తానాబాద్ సహకార సంఘం రైతులకు ఎరువులు విత్తనాలు అందించడంతో పాటు పలు రకాల రుణాలు ఇస్తూ వాటిని సకాలంలో వసూలు చేయడంతో పాటు సంఘ ఆదాయ అభివృద్ధికి అనేక రకాల వ్యాపారాలు నిర్వహిస్తుండడం అభినందనీయమన్నారు. సీజీఎం తదితరులను సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ కార్యక్రమం లో నాబార్డు ఏజీఎం జయప్రకాష్, డీడీఎం దిలీప్ కుమార్, కేడీసీసీబీ సీఈఓ సత్యనారాయణరావు, జనరల్ మేనేజర్ రియాజ్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ వెంకటేశ్వర్లు, రిసోర్స్‌పర్సన్ సత్యనారాయణ, నాగిరెడ్డి, డైరక్టర్లు సురేష్ రెడ్డి, లచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

ఫలించనున్న నిరీక్షణ..

(3వ పేజీ తరువాయి)

పిటిషన్ వేయని కారణంగానే జాప్యం జరిగి దరఖాస్తులు పరిశీలనకు నోచుకోలేదు.

● **ప్రయోజనాలకు దూరం..**

దరఖాస్తులన్నీ మండల తహసీల్దార్ కార్యాలయాల్లో మూలుగుతున్నాయి. ఆ దరఖాస్తులను పరిశీలించని కారణంగా రైతులు ప్రభుత్వం అమలుచేస్తున్న రైతుబంధు పథకం ద్వారా వచ్చే సాయం, ప్రధాని కిసాన్ సమ్మాన్ నిధి పథకం ద్వారా అందే సాయాన్ని కోల్పోతున్నారు. అలాగే రైతుబీమాకు నోచుకోవడం లేదు. బ్యాంకుల ద్వారా వడ్డీ లేని పంట రుణాలను, ఇతరత్రా రుణాలను పొందలేక పోతున్నారు. సాదాబైనామా దరఖాస్తులను ఎప్పుడు పరిశీలిస్తారా అని ఎదురుచూస్తున్న రైతులు రెవెన్యూ కార్యాలయాలకు వెళ్లి ఆరా తీయడం ప్రారంభించారు. గత ప్రభుత్వం దరఖాస్తులను పరిశీలించకపోవడంతో భూములను విక్రయించిన పట్టాదారులు, వారి వారసులు అక్కడక్కడ వివాదాలు సృష్టించారు. ఈ భూములు తమవేనని, తాము విక్రయించలేదంటూ తిరగబడుతున్నారని చెబుతున్నారు. గత ఏడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ధరణి పోర్టల్‌ను ఎత్తివేస్తామని, నూతన రెవెన్యూ చట్టాన్ని తీసుక వస్తామని కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన విషయం తెలిసిందే. అధికారంలోకి వచ్చిన ఆ పార్టీ ధరణి పోర్టల్‌పై ఒక సబ్ కమిటీని వేసి అధ్యయనం చేయించింది. అందులో ఉన్న లోపాలను సవరించేందుకు పలు సూచనలు చేసింది. వాటిని పరిశీలించిన ప్రభుత్వం ఆర్‌వోఆర్ చట్టం-2020ని ప్రక్షాళన చేసి నూతన ఆర్‌వోఆర్ చట్టం-2024 భూభారతిని తీసుకవచ్చింది. దీనిని అసెంబ్లీలో కూడా రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రవేశపెట్టారు. దీని ద్వారా సాదాబైనామాలను క్రమబద్ధీకరిస్తామన్నారు. దీంతో పెండింగులో ఉన్న దరఖాస్తులు మరి కొద్ది రోజుల్లో పరిష్కారం కానున్నాయి.

వేగవంతంగా ఇందిరమ్మ ఇళ్ల సర్వే : డీపీవో

ఓదెల, డిసెంబర్ 20 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇళ్ల సర్వేలను వేగవంతం చేయాలని జిల్లా పంచాయతీ అధికారి వీరబుచ్చయ్య తెలిపారు. శుక్రవారం మండలంలోని కొలనూర్, గోపరపల్లి గ్రామాల్లో పంచాయతీ అధికారి వీర బుచ్చయ్య ప్రకటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈనెల 25 వరకు సర్వేలను పూర్తి చేసి, నివేదికలను సమర్పించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీవో షబ్బీర్ పాష, కార్యదర్శులు శ్రీనివాస్, నాగరాజు తోపా టు తదితరులు పాల్గొన్నారు.

● పెద్దపల్లి రూరల్ (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పక్కాగా చేపట్టాలని జిల్లా పంచాయతీ అధికారి వీరబుచ్చయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని మూలసాల గ్రామంలో ఇంటింటా చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను డీపీవో వీరబుచ్చయ్య మండల అధికారులతో కలిసి పరిశీలించారు. పెద్దపల్లి డీఎల్‌పీవో వేణుగోపాల్, ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో ఫయాజ్, పంచాయతి కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

● సుల్తానాబాద్ (ఆంధ్రజ్యోతి) : సుల్తానాబాద్ మండలంలోని సుద్దాల గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల కోసం అధికారులు చేస్తున్న సర్వేను డీపీవో వీర బుచ్చయ్య పర్యవేక్షించారు. ఇప్పటివరకు 5470 ఇండ్ల సర్వే పూర్తయినట్లు ఎంపీడీవో దివ్యదర్శన్‌రావు తెలిపారు.

ఆసుపత్రి నిర్మాణం త్వరగా పూర్తిచేయాలి

పెద్దపల్లిటౌన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ఆస్పత్రి ఆవరణలో నూతనంగా నిర్మాణం చేపట్టిన 42 పడకల ఆసుపత్రి భవనాన్ని ప్రజలకు త్వరగా అందుబాటులోకి తీసుకరావాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు. శుక్రవారం కలెక్టర్ ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో నిర్మిస్తున్న 42 పడకల ఆసుపత్రి భవన నిర్మాణాన్ని పరిశీలించారు. ప్రజల సౌకర్యార్థం ఆసుపత్రి ప్రాంగణంలో మరో 42పడకల ఏర్పాటు చేసేలా భవన నిర్మాణం జరుగుతుందని, వీటి పనులను జనవరిలోగా పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొనిరావాలన్నారు. తనిఖీలలో టీఎస్‌ఎమ్‌ఐడీసీ ఈఈ ఏ.రవీందర్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పన్నూరు వంతెన పనుల పరిశీలన

రామగిరి, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని పన్నూరు వాగుపై వంతెన నిర్మాణ పనులను పంచాయతీరాజ్‌శాఖ అధికారులు శుక్రవారం పరిశీలించారు. వంతెన లేని కారణంగా పొలాల్లోకి వెళ్లే రైతుల ఇబ్బందులు ఎదుర్కొంటున్న క్రమంలో గ్రామ మాజీ ఎంపీటీసీ చిందం మహేష్ ఇటీవల మంత్రి శ్రీధర్‌బాబుకు ప్రతిపాదనలు పంపించారు. దీనిపై స్పందించిన మంత్రి శుక్రవారం పంచాయతీరాజ్‌శాఖ అధికారులకు వంతెన నిర్మాణం ఎస్టిమేట్ వేయాలని ఆదేశాలు జారీ చేశారు. అందులో భాగంగా పన్నూరు గ్రామంలోని వాగును పంచాయతీరాజ్ శాఖ ఏఈ వరలక్ష్మి, వర్క్ ఇన్‌స్పెక్టర్ వెంకటేష్ తదితరులు పరిశీలించారు. వారి వెంట మాజీ ఎంపీటీసీ చిందం మహేష్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి



సమ్మెలో పాల్గొన్న సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు

పెద్దపల్లి రూరల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులందరిని రెగ్యూలరైజ్ చేస్తామని ఇచ్చిన మాటను ప్రభుత్వం నిలబెట్టుకోవాలని జాక్ అధ్యక్షుడు తిప్పని తిరుపతి అన్నారు. తెలంగాణ రాష్ట్ర సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో కాంట్రాక్టు ఉద్యోగులందరిని రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ మండల పరిషత్ కార్యాలయం ఎదుట చేస్తున్న నిరవధిక సమ్మె శుక్రవారం 11వ రోజుకు చేరింది. ఉద్యోగులు కబడ్డీ ఆడుతూ నిరసన వ్యక్తం చేశారు. సమగ్ర శిక్ష ఉద్యోగులకు తెలంగాణ రాష్ట్ర స్కూల్స్ మేనేజ్మెంట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కేశవరెడ్డి, ఎం వెంకటరెడ్డి, తపస్ జిల్లా అధ్యక్షులు ఎం సునీల్‌రెడ్డి, ఓదెల మాజీ జడ్పీటీసీ గంట రాములు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో నాయకులు తాళ్లపల్లి మల్లన్న, వెంకటేశం, కేజీబీవి నాయకులు పుల్లూరు సంధ్యారాణి, రాజకుమార్ తదితరులు పాల్గొన్నారు.

తుంగాని రాజన్నకు ఘన నివాళి

ఓదెల, డిసెంబర్ 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొలనూర్‌లో శుక్రవారం నాటి పీపుల్స్‌వార్ సీవో తుంగాని రాజన్న అలియాస్ గోపన్న వర్ధంతిని కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించుకున్నారు. 1985లో తుంగాని రాజన్న మృతిచెందగా, కొలనూర్‌లో రాజన్న స్మారకార్థం నిర్మించిన స్థూపం వద్ద ఆయన భార్య రాధ, కూతురు క్రాంతి, అల్లుడు దేవేందర్, ఇతర బంధువులు నివాళులు అర్పించారు.

కేంద్ర మంత్రి అమిత్‌షా వ్యాఖ్యలపై నిరసనలు



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

పెద్దపల్లిటౌన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర మంత్రి అమిత్‌షాను బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం పెద్దపల్లి కమాన్ వద్ద సీఐటీయూ, ఎస్ఎఫ్ఐ, కేవీపీఎస్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి జిల్లాల ప్రశాంత్, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు మోదంపెల్లి శ్రావణ్ మాట్లాడారు. సీఐటీయూ జిల్లా సహాయకార్య దర్శి జి. జ్యోతి, సిపెల్లి రవీందర్, నాయకులు సావన పెల్లి వెంకటస్వామి, కుక్క అన్వేష్, ఎస్ఎఫ్ఐ నాయకు లు నితిన్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

● సుల్తానాబాద్ (ఆంధ్రజ్యోతి) : సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం సుల్తానాబాద్ పట్టణంలో అంబేద్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేసి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు అశోక్, కార్మికులు రాంమూర్తి, సురేష్, రాయమల్లు, లక్ష్మణ్, నర్సింగ్, పాపయ్య, శ్రీను, కుమార్ పాల్గొన్నారు.

● జూలపల్లి (ఆంధ్రజ్యోతి) : కేంద్ర మంత్రి అమిత్‌షాను బర్తరఫ్ చేయాలని అంబేద్కర్ సంఘం నాయకులు మామిడిపెల్లి చంద్రశేఖర్ మాదిగ, మానుమండ్ల శ్రీనివాస్‌మాదిగ, బీసీ నాయకులు డిమాండ్ చేసారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. ముమ్మాడి రవి, ఎండి గౌస్‌పాషా, మామిడిపెల్లి కాంతయ్య తదితరులు పాల్గొన్నారు.

● పాలకుర్తి (ఆంధ్రజ్యోతి): మండలంలోని కన్నాలలో శుక్రవారం గ్రామ మాల సంఘం అధ్యక్షుడు బుట్టి శ్రీధర్ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలిపారు. కార్యక్రమంలో మాలమహానాడు ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్షుడు దేవి లక్ష్మీనర్సయ్య, బుట్టి కృష్ణ ప్రసాద్, దేవి శ్రీనివాస్, బుట్టి మీణయ్య, ఇటుకల రమ్య, కాసర్ల ఆదిత్య పాల్గొన్నారు.

ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుకు కృషి

- ఎంపీడీవో పూర్ణచందర్‌రావు


పాలకుర్తి,డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుకు తన వంతు పాటు పడుతానని పాలకుర్తి ఎంపీడివో అల్లం పూర్ణచందర్‌రావు అన్నారు. మంథని నుంచి బదిలీపై వచ్చిన ఆయన శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కార్యాలయ సిబ్బంది, వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది ఆయనకు స్వాగతం పలికి సత్కరించారు. ఈ సందర్భంగా పాత్రికేయులతో ఎంపీడీవో మాట్లాడుతూ కలెక్టర్, రామగుండం ఎమ్మెల్యే ఆదేశాలతో డిప్యుటేషన్‌పై వచ్చానని తెలిపారు. సిబ్బంది విధుల్లో పారదర్శకంగా పనిచేయాలన్నారు. అనంతరం ఆయన కుక్కలగూడూర్, జయ్యారం తదితర గ్రామాల్లో పర్యటించి ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలించారు.

మంథని ఎంపీడీవోగా శశికళ

మంథని, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మంథని ఎంపీడీవోగా శశికళ బదిలీపై మంథనికి వచ్చారు. ఇక్కడ పనిచేసి పూర్ణచందర్‌ను పాలకుర్తికి బదిలీ చేశారు. పాలకుర్తి ఎంపీడీవోగా పని చేసిన శశికళను మంథనికి ఎంపీడీవోగా బదిలీ చేయగా, శుక్రవారం ఆమె బాధ్యతలు స్వీకరించారు.

కోర్టును పక్కదోవ పట్టించిన రెవెన్యూ, మున్సిపల్ అధికారులు

కళ్యాణ్‌నగర్, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని ఓల్డ్ అశోక థియేటర్ వద్ద తమ షాపులను సమయం ఇవ్వకుండానే కూల్చివేశారని, రెవెన్యూ, మున్సిపల్ అధికారులు హై కోర్టును తప్పుదారి పట్టించారని ఓల్డ్ అశోక షాపుల యజమానులు పులిపాక రాజ్‌కుమార్, గాదె రామరాజు ఆరోపించారు. శుక్రవారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గత ఏడాది మార్చి 23న రాత్రికి రాత్రే ఓల్డ్ అశోక థియేటర్‌ను కూల్చివేశారని, తాము తమ షాపుల కోసం హైకోర్టును ఆశ్రయించామన్నారు. మున్సిపల్ అధికారులు, రెవెన్యూ అధికారులను ఇంప్లీడ్ చేస్తూ హై కోర్టుకు వెళ్లామన్నారు. రామగుండం తహసీల్దార్ మొదట పట్టాలు మేము ఇచ్చినవి కాదని చెప్పారని, ఆ తరువాత సర్వే నెంబర్లు లేవని కోర్టుకు చెప్పారని, 2008న తాము షాపులకు పట్టాలు తీసుకుని ఎల్ఆర్ఎస్ కూడా కట్టామని చెప్పారు. స్టే వెకెట్ కాగానే వచ్చి తమ షాపులను కూల్చివేశారని, సమయం ఇవ్వకుండా అధికారులు చట్టానికి విరుద్ధంగా పని చేస్తున్నారని ఆరోపించారు. షాపులు అత్యవసరంగా కూలగొట్టి అక్కడ ఏం నిర్మాణం చేస్తారో ఇప్పటి వరకు చెప్పడం లేదని, రోడ్ల విస్తరణ పేరుతో తమ షాపులను కూల్చివేయడం అన్యాయమన్నారు. విలేకరుల సమావేశంలో ఉపేందర్, షేక్ అయాజ్, కోటేశ్వర్, జమీల్, ప్రభాకర్, సత్యనారాయణ పాల్గొన్నారు.



కాంట్రాక్టు కార్మికుల వేతనాలను పెంచాలి

యైటింక్లయిన్‌కాలనీ, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): సింగరేణి కాంట్రాక్టు కార్మికుల వేతనాలను పెంచాలని సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ నాయకుడు ఉల్లి మొగిలి డిమాండ్ చేశారు. శుక్రవారం ఓసీపీ-3 కృషిభవన్‌లో 23న బ్లాక్‌డే పేరిట కరపత్రాలను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. కోల్‌ఇండియా వేతనాలు అమలు చేయకుండా సింగరేణి యాజమాన్యం కాంట్రాక్టు కార్మికుల శ్రమను దోచుకుంటున్నట్టు పేర్కొన్నారు. కార్మికులకు వారి కుటుంబ సభ్యులకు వైద్య సదుపాయం, క్యాంటీన్ సదుపాయం కల్పించడం లేదన్నారు. కేటగిరీ ఆధారంగా వేతనాలు చెల్లింపులు జరగడంలేదని, మైన్స్, లేబర్, చట్టాలను సింగరేణి అమలు చేయడం లేదని ఉల్లి మొగిలి తెలిపారు. వేతనాలు పెంచాలని, చట్టబద్ధ సదుపాయాలు కల్పించాలని ఏళ్ళ తరబడి కాంట్రాక్టు కార్మికులు ఆందోళన చేస్తున్నా యాజమాన్యం స్పందిచలేదన్నారు. 2022 సెప్టెంబరున 18 రోజుల సమ్మె సందర్భంగా జరిగిన ఒప్పందాలను సైతం యాజమాన్యం తుంగలో తొక్కినట్టు పేర్కొన్నారు. యాజమాన్య దోరణికి నిరసనగా ఈనెల 23న సింగరేణి వ్యాప్తంగా నల్ల బ్యాడ్జీలు, నల్ల జండాలతో నిరసనలు తెలియజేయాలని కాంట్రాక్టు కార్మికులకు మొగిలి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భూమయ్య, లక్ష్మీనారాయణ, రామన్న, సమ్మయ్యతో పాటు కాంట్రాక్టు కార్మికులు పాల్గొన్నారు.

జీఎం ఆఫీస్‌లో సమస్యలపై సిబ్బంది వినతి

యైటింక్లయిన్‌కాలనీ, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆర్జీ-2 జీఎం ఆఫీస్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం జీఎం బండి వెంకటయ్యకు ఉద్యోగులు వినతిపత్రాన్ని అందజేశారు. మహిళా ఉద్యోగులకు రెస్ట్‌హాల్, బాత్‌రూమ్స్ నిర్మించాలని, జీఎం ఆఫీస్ స్టాఫ్‌కు క్యాంటీన్, బైక్ షెడ్డు నిర్మించాలని కోరారు. ప్రింటర్లు, అవసరమైన ఫర్నీచర్ సమకూర్చాలని, వాటర్ ప్లాంట్ మెయింటనెన్స్ సక్రమంగా చేయాలని కోరారు. అన్ని డిపార్ట్‌మెంట్లకు రికార్డు మెయింటనెన్స్ రూం, మహిళా ఉద్యోగినిల చిన్నారులకు సంరక్షణ కేంద్రం ఏర్పాటు చేయాలని, విజిటర్స్‌కు ప్రత్యేక పార్కింగ్‌రూం ఏర్పాటుచేయాలని కోరారు. వినతి పత్రం ఇచ్చినవారిలో ఐఎన్‌టీయూసీ ఆర్జీ-2 వైస్‌ప్రెసిడెంట్ కొత్త సత్యనారాయణరెడ్డి, ఐరెడ్డి సంపత్‌రెడ్డిలతో పాటు జీఎం ఆఫీస్ ఉద్యోగులు ఉన్నారు.

ఆవిర్భావ వేడుకల పోటీల పరిశీలన..


మాట్లాడుతున్న సేవా అధ్యక్షురాలు అనితలలిత్‌కుమార్


గృహాలను పరిశీలిస్తున్న కమిటీ సభ్యులు

గోదావరిఖని, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): సింగరేణి ఆవిర్భావ వేడుకల సందర్భంగా స్థానిక ఆర్‌సీఓఏ క్లబ్‌లో నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాల రిహార్సల్‌ను ఆర్జీ-1 సేవా అధ్యక్షురాలు అనిత లలిత్ కుమార్, ఎస్ఓటూ జీఎం గోపాల్ సింగ్ శుక్రవారం పరిశీలించారు. విద్యార్థులు, డ్యాన్స్ అకాడమీ చేస్తున్న రిహాల్స్‌ను తిలకించారు. ఈ కార్యక్రమంలో పర్సనల్ మేనేజర్ రవీందర్‌రెడ్డి, సేవా కార్యదర్శి శిరీష, సేవా జాయింట్ సెక్రెటరీ బినాసింగ్, సేవా కో ఆర్డినేటర్ మేడి తిరుపతి పాల్గొన్నారు.

● యైటింక్లయిన్‌కాలనీ, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): సింగరేణి ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం సెక్టార్-3 కాలనీ పరిధిలోని ఉత్తమ పర్యావరణహిత గృహాల ఎంపిక కోసం కమిటీ సభ్యులు ఉద్యోగుల గృహాలను పరిశీలించారు. ఇంటి ఆవరణలో పచ్చదనం, మొక్కల పెంపకం, అలంకరణలను పరిగణలోకి తీసుకుని ఎంపిక కమిటీ గృహాలను పరిశీలించారు. కమిటీ సభ్యులుగా ఏఐటీయూసీ బ్రాంచి సెక్రెటరీ జిగురు రవీందర్, డీజీఎం పర్సనల్ అనిల్‌కుమార్, సివిల్ ఈఈ ప్రతాపగిరి రాజు, ఫారెస్ట్ ఆఫీసర్ నవీన్ కుమార్ వ్యవహరించారు.

సింగరేణి ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని కాలనీలో నిర్వహించిన దీపాలంకరణ, ముగ్గుల పోటీలు అలరించాయి. శుక్రవారం రాత్రి స్థానిక అబ్దుల్‌కలాం స్టేడియంలో జరిగిన పోటీల్లో పలువురు కార్మిక కుటుంబాలకు చెందిన మహిళలు, సేవా సమితి సభ్యులు పోటాపోటీగా దీపాలను అలంకరించారు. మహిళలు అలంకరించిన దీపాలు చూపరుల ను ఆకట్టుకున్నాయి. డీజీఎం పర్సనల్ అనిల్‌కుమార్, స్పోర్ట్స్ సూపర్ వైజర్ నరేంద రొరెడ్డిలు దీపాలను పరిశీలించారు.

● రామగిరి (ఆంధ్రజ్యోతి): సింగరేణి ఆర్జీ-3, ఏపీఏ డివిజన్ల పరిధిలోని డిస్పెన్సరీలో శుక్రవారం వెల్‌బేబీ షోను నిర్వహించారు. ముఖ్యఅతిథిలుగా ఆర్జీ-3, ఏపీఏ జీఎంలు సుధాకర్‌రావు, వెంకటేశ్వర్లు హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ పోటీలకు చిన్నారులు పెద్ద సంఖ్యలో హాజరుకావడంతో ఆహూతులను అలరించింది. ఉత్తమ బేబీలకు సింగరేణి ఆవిర్భావ వేడుకల్లో బహుమతులను ప్రదానం చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో సేవా అధ్యక్షురాలు అలివేణి, విజయలక్ష్మి, గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు రామచంద్రరెడ్డి, కోట రవీందర్‌రెడ్డి, అధికారులు శ్రీనివాసరావు, రఘుపతి, సత్యనారాయణ, సుదర్శనం, గుర్రం శ్రీహరి, డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, ఆదినారయణ, పద్మ, నజ్మా పాల్గొన్నారు.

సింగరేణి దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహిస్తున్న పోటీల్లో భాగంగా శుక్రవారం సెంటినరీకాలనీలోని కమ్యూనిటీ హాల్‌లో దీపాలంకరణ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలకు సేవా అధ్యక్షురాలు అలివేణి ముఖ్యఅతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. పెద్ద సంఖ్యలో మహిళలు హాజరై రంగవల్లులు వేసి దీపాలతో అందంగా అలంకరించారు. కోఆర్డినేటింగ్ అధికారి గుర్రంశ్రీహరి, అధికారులు సునీల్‌ప్రసాద్, సేవా సభ్యులు హరిణి, సుజాత, ఉమాదేవి, మల్లేశ్వరీ, ఉమాదేవి, సేవా కోఆర్డినేటర్ సుధాకర్, సభ్యులు పాల్గొన్నారు.

వేడుకల ఏర్పాట్లను పరిశీలించిన జీఎం

రామగిరి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): సింగరేణి ఆర్జీ-3 డివిజన్ పరిధిలోని రాణిరుద్రమాదేవి క్రీడప్రాంగణాన్ని శుక్రవారం జీఎం సుధాకర్‌రావు, అధికారుల బృందం పరిశీలించారు. ఈనెల 23న నిర్వహించే సింగరేణి వేడుకల ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రాంగణంలోని వేదిక, స్టాల్స్, పార్కింగ్, లైటింగ్ తదితర అంశాలపై వివిధ విభాగాలకు చెందిన అధికారులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో జీఎంతో పాటు అధికారులు రఘుపతి, రాజేంద్రకుమార్, సుదర్శనం, షబిరుద్దీన్, సతీష్, గుర్రం శ్రీహరి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఓసీపీ-2లో కూలుతున్న బెంచ్‌లు..


ప్రమాదకరంగా ఉన్న సైడ్‌బెంచ్‌లు

రామగిరి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): సింగరేణి ఆర్జీ-3 డివిజన్ పరిధిలోని ఓసీపీ-2లో ప్రమాద ఘంటికలు మోగుతు న్నాయి. ఓసీపీ-2 విస్తరణ ఓబీ పనులు డేంజర్ జోన్‌లో సాగుతు న్నాయి. మంథని-పెద్దపల్లి ప్రధా న రహదారిని అనుకొని ఓసీపీ-2 క్వారీలో ప్రైవేట్ కంపెనీ ఓబీని తొలగిస్తుండగా క్వారీలోని కింద బెంచ్‌లలో సింగరే ణి సంస్థ ఆధ్వర్యంలో కార్మికులు బొగ్గును తీస్తున్నారు. కాగా రహదారి వైపు బెంచ్ లు ఏటవాలుగా చేయడానికి సరిపోయేంత భూమి లేక నిట్టనిలువుగా ఓబీ తొల గిస్తుండడంతో హైవాల్ బెంచ్‌గా మారి ప్రమాదకర ఘంటికలను మోగిస్తున్నాయి. హైవాల్‌గా పెరగడంతో ఒత్తిడికి గురైన 3 బెంచ్‌లు ఇటీవల పెద్దశబ్దంతో క్వారీ దిగువ భాగంలోకి పెద్దఎత్తున కూలింది. కూలీన సమయంలో దిగువన కార్మికులు లేని కారణంగా తృటిలో బారీ ప్రమాదం తప్పింది. గత రెండు రోజులుగా వరుసగా బెంజ్‌లు కొంత మేరకు కూలుతూ ప్రమాద సంకేతాలు కన్పిస్తున్నా ఆ ప్రమాదకరమైన హైవాల్ బెంచ్ కిందనే సింగరేణి కార్మికులకు పనులను పురమాయిస్తున్నారు. గత మూడు నెలల క్రితం ఇదే నిట్టనిలువుగా ఉన్నా హైవాల్ బెంచ్ కింద లీకైన మోటార్ పైపులు జాయింట్లు కోసం తవ్వి ఇద్దరి కార్మికులు సజీవ సమాధి అయిన విషయం విదితమే. కాగా, సింగరేణి యాజమాన్యం అదే పొరపాటు పునరావృతం చేసే పద్ధతిని అనుసరిస్తోందని విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. మల్టీ డిపార్ట్‌మెంట్ పేర రక్షణ సూత్రాలను వల్లిస్తున్న యాజమాన్యం అందుకు అనుగుణంగా రక్షణ చర్యలు చేపట్టడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా యాజమాన్యం ముందస్తు రక్షణ విషయంలో ఏమారుపాటును ప్రదర్శిస్తోందనే వాదన కార్మికుల నుంచి వినిపిస్తోంది.